ANDHRAJYOTHY

# ఆంధ్రజ్యోతి

3



## చిత్తూరు జిల్లా వార్తలు

మంగళవారం 27 మే 2025



**ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక**

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట : 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు : 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు : 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి : 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు : 99890 59755




## ఈసారి రోహిణిలో
# రోళ్లు పగలవ్!

- జిల్లాలో విచిత్ర వాతావరణం
- వర్షాలకు తోడు ముందే పలకరించిన నైరుతి
- ఫలితంగా తగ్గుముఖం పట్టిన ఉష్ణోగ్రతలు

చిత్తూరు, మే 26 (ఆంధ్రజ్యోతి):రోహిణీ కార్తెలో రోళ్ళు పగులుతాయనే సామెత వినని వారుండరు. ఏటా వేసవి చివరి దశలో వచ్చే ఈ కార్తెలో రోళ్ళు పగిలే స్థాయిలో ఎండలు కాస్తాయని ప్రతీతి. అయితే ప్రస్తుత వేసవిలో మాత్రం రోహిణీ కార్తె ప్రభావం మందగించింది. అరుదుగా సంభవించే ఈ పరిణామం తాజా వేసవిలో జిల్లా అనుభవానికొస్తోంది. అకాల వర్షాలకు తోడు నైరుతి రుతుపవనాలు ముందుగానే పలకరించడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

మే 25న రోహిణి కార్తె ప్రారంభమైంది. వాస్తవానికి రోహిణి కార్తె రోజుల్లో ఉష్ణోగ్రతలు 42-46 డిగ్రీల మధ్య నమోదవుతాయి.వడగాల్పులు,తీవ్ర వడగాడ్పులు ఉంటాయి.అయితే విచిత్రంగా ఈ ఏడాది మే నెల ద్వితీయార్థం నుంచీ ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి.జిల్లావ్యాప్తంగా పలుచోట్ల అకాల వర్షాలు కురుస్తున్నాయి. మోస్తరు వాన నుంచీ భారీ వర్షాల దాకా పడుతున్నాయి.ఈ వర్షాల కారణంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుముఖం పడుతున్నాయి.కొంత మేరకు ఉక్కపోత నెలకొంటున్నా మొత్తం మీద చూస్తే ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఈ అకాల వర్షాలకు తోడు నైరుతి రుతుపవనాలు వారం రోజులు ముందుగానే ప్రభావం చూపుతున్న సంగతి తెలిసిందే. నైరుతి రుతుపవనాల ముందస్తు రాక కూడా ఉష్ణోగ్రతలు తగ్గడానికి కారణమవుతోంది. ఇవన్నీ కలిపి ఈ వేసవిలో జిల్లాపై రోహిణీ కార్తె ప్రభావాన్ని తగ్గించాయి.

**ఖరీఫ్‌కు మేలు.. మామిడికి నష్టం**

రుతుపవనాల ముందస్తు రాకతో జూన్ నుంచీ మొదలు కానున్న ఖరీఫ్ సీజను పంటల సాగుకు సానుకూలం అవుతుందన్న ఆశాభావం రైతాంగంలో వ్యక్తమవుతోంది.ప్రస్తుతం జిల్లాలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది.ఈ సీజన్‌లో ప్రధాన పంట అయిన వేరుశనగను ఈ వర్షాల కారణంగా కాస్త ముందే సాగు చేసుకుంటాం అంటోంది రైతాంగం.అయితే వర్షాలు మామిడి పంటకు మాత్రం నష్టాన్ని తెచ్చే అవకాశాలున్నాయి. ఈసారి దిగుబడి బాగున్నా, వర్షాలతో మామిడిలో పురుగులు పట్టే అవకాశం ఉంది.

**గతేడాది ఇద్దరు వృద్ధుల మృతి**

గతేడాది రోహిణీ కార్తె ప్రభావం తీవ్రంగానే వుండింది. సాధారణ ఎన్నికల కారణంగా వలంటీర్లతో ఇంటింటి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం ఆపేసింది. సచివాలయ ఉద్యోగులతో ఇంటింటికీ వెళ్లి పెన్షన్లను పంపిణీ చేయించలేమని చేతులెత్తేసింది. దీంతో గతేడాది ఏప్రిల్‌లో పెన్షన్ కోసం సచివాలయానికి వెళ్లిన గుడిపాల మండలానికి చెందిన ఓ వృద్ధుడు ఎండ వేడిమి తాళలేక మరణించారు. అలాగే మే నెలలో కార్వేటినగరం మండలానికి చెందిన మరో వృద్ధుడు పెన్షన్ తీసుకుని వస్తూ వడదెబ్బతో మృతి చెందారు.

### ఈ వేసవిలో విస్తారంగా వర్షాలు

చిత్తూరు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది మోస్తరు నుంచి రికార్డుస్థాయిలో వర్షాలు కురిసాయి.నెలరోజులుగా ఏదో ఒక ప్రాంతంలో ఈదురుగాలులు వీయడం, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు సాధారణమయ్యాయి. 2024 జూన్ 1 నుంచి 2025 మే 26వ తేది వరకు 824.2 మిమీ వర్షానికి గాను 1198.8 మిమీ వర్షపాతం (47.2శాతం అధికం) నమోదయ్యింది. మేనెల సాధారణ వర్షపాతం 45 మిమీ కాగా, సోమవారం నాటికి 144.4 సరాసరి వర్షపాతం నమోదయ్యింది. మార్చి, ఏప్రిల్ నెలల్లో 16.4 మిమీ సాధారణ వర్షపాతానికి మించి 40.4 మిమీ వర్షం కురిసింది. జనవరి, ఫిబ్రవరి నెలలో 7.7 సాధారణ వర్షపాతం బదులు 24.1 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

### హెచ్‌ఎం బదిలీలకు 210 దరఖాస్తులు

**ఎంఈవో లాగిన్లకు ఎడిట్ ఆప్షన్**

చిత్తూరు సెంట్రల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యాశాఖలో చేపడుతున్న టీచర్ల బదిలీ ప్రక్రియలో భాగంగా తొలి దశ సోమవారంతో కొలిక్కి వచ్చింది. ప్రధానోపాధ్యాయు (హెచ్‌ఎం)ల బదిలీల కోసం 210 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో 208 ఆమోదం పొందగా, రెండు తిరస్కరణకు గురయ్యాయి. మొత్తం 181 ఖాళీలు ఉన్నాయి. యాజమాన్యాల వారీగా.. జడ్పీలో 155, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10, మున్సిపల్ కార్పొరేషన్‌లో 9, మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలల్లో ఏడు ఖాళీలున్నాయి. మంగళవారంతో హెచ్‌ఎంల బదిలీ ప్రక్రియ ముగియనుంది. ఇదిలా ఉండగా, నిబంధనలు అనుసరించి ఎడిట్ ఆప్షన్ ఎంఈవో లాగిన్లకు ఇచ్చారు. బదిలీల కోసం స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు దరఖాస్తు చేసుకునే క్రమంలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించుకోవచ్చు. అయితే సమస్యల పరిష్కారంపై ఎంఈవోలు దృష్టి సారించక పోవడంతో టీచర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అటువంటి వారంతా డీఈవో కార్యాలయానికి క్యూ కడుతున్నారు. ఎంఈవోలు ఇలాగే వ్యవహరిస్తే షోకాజ్ నోటీసులు ఇచ్చేందుకు సైతం జిల్లా విద్యాశాఖ అధికారులు సిద్ధమవుతున్నారు.





ముఖ్యమంత్రి చంద్రబాబుకు వీడ్కోలు పలకుతున్న ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు - అర్జీలు స్వీకరిస్తున్న చంద్రబాబు

## ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘనంగా వీడ్కోలు

కుప్పం, మే 26 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల కుప్పం పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రి చంద్రబాబు దంపతులకు సోమవారం తెలుగుదేశం నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, వారి కుమారుడు మంత్రి నారా లోకేశ్, బ్రాహ్మణి దంపతులు ఈనెల 24వ తేదీన కుప్పం వచ్చిన విషయం తెలిసిందే. శాంతిపురం మండలం కడపల్లె పంచాయతీ శివపురం వద్ద నూతనంగా నిర్మించుకున్న చంద్రబాబు సొంత ఇంటి గృహప్రవేశం ఆదివారం ఉదయం అంగరంగ వైభవంగా జరిగింది.రాత్రి నూతన గృహంలోనే బస చేశారు. సోమవారం ఉదయం 10.10గంటల ప్రాంతంలో చంద్రబాబు దంపతులు ద్రావిడ విశ్వవిద్యాలయంలోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. హెలికాప్టర్ ఎక్కి, బెంగళూరు విమానాశ్రయం, అక్కడినుంచి అమరావతి చేరుకున్నారు. సాయంత్రం దాకా సొంత ఇంటిలోనే బస చేసిన మంత్రి నారా లోకేశ్, సాయంత్రం 5 గంటల ప్రాంతంలో రోడ్డు మార్గం ద్వారా కడపకు బయలుదేరారు.కడప జిల్లాలో మంగళవారంనుంచి మహానాడు జరగనున్న విషయం తెలిసిందే. కాగా నారా బ్రాహ్మణి సోమవారం ఉదయం హైదరాబాదు బయల్దేరి వెళ్లిపోయారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బీఆర్. సురేశ్‌బాబు తదితరులు ముఖ్యమంత్రి దంపతులకు వీడ్కోలు పలికారు.

### నేడు ఎస్‌ఏల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

చిత్తూరు సెంట్రల్, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెచ్‌ఎంల పదోన్నతికి ఎస్‌ఏల ధ్రువీకరణ పత్రాల పరిశీలన మంగళవారం చేపట్టనున్నట్లు డీఈవో వరలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం జడ్పీ, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల ఎస్‌ఏల సీనియారిటీ జాబితా డీఈవో వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. సీనియారిటీ జాబితా పరిశీలన 1:3 రేషియోలో చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జాబితాలోని ఎస్‌ఏలు విద్యార్హత సర్టిఫికెట్లు, సర్వీసు బుక్స్‌లతో మంగళవారం ఉదయం తొమ్మిది గంటలకు చిత్తూరు లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో పరిశీలనకు రావాలన్నారు. డిపార్టుమెంటల్ టెస్టు ఎంట్రీలను సర్వీసు బుక్‌లో నమోదయ్యేలా చూసుకోవాలని ఎస్‌ఏలకు డీఈవో సూచించారు.

### ఈఏపీ సెట్‌కు 63 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, మే 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థానిక ఎస్వీసెట్, సీటమ్స్, వేము కళాశాలల్లో సోమవారం నిర్వహించిన ఏపీ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏపీ ఈఏపీ సెట్)కు మంది 63 మంది విద్యార్థులు గైర్హాజరైయారు. రెండు సెషన్లలో నిర్వహించిన పరీక్షల్లో 1208 మందికి 1145 మంది హాజరవగా, 63 మంది గైర్హాజరైయారు. ఫస్టు సెషన్‌లో 591 మందికి 558 మంది, రెండో సెషన్‌లో 617 మందికి 587 మంది విద్యార్థులు హాజరయ్యారు.

## హాలో.. చంద్రగిరి ఎమ్మెల్యే పీఏని మాట్లాడుతున్నా!

- ఎయిర్ పోర్టులో ఉద్యోగాల పేరిట మోసం
- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన క్యాబ్ డ్రైవరు
- మాజీ మంత్రి అనుచరులతో సంబంధాలు?

తిరుపతి(కలెక్టరేట్), మే 26(ఆంధ్రజ్యోతి): అతడు క్యాబ్ డ్రైవర్. కానీ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పీఏ పవన్‌నని చెప్పుకొంటాడు. 'హలో.. నేను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పీఏ పవన్‌ను మాట్లాడుతున్నా. ఎయిర్‌పోర్టులో ఉద్యోగాలు ఉన్నాయి. మీరు ఎక్కువ కట్టాల్సిన అవసరం లేదు. అంతా కలిపి రూ.50వేలు లోపు పంపిస్తే చాలు' అంటూ కొంతకాలంగా అమాయక యువతను మోసగిస్తున్నాడు. ఎట్టకేలకు ఇతడిని తిరుచానూరు పోలీసులు పట్టుకున్నారు. అతడికి ఓ మాజీ మంత్రి అనుచరుల వాట్సప్ గ్రూప్‌లో పేరు ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. తిరుచానూరు ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి తెలిపిన ప్రకారం.. తిరుపతి నగరం కొర్లగుంటలోని అమాస బాలు అలియాస్ ఇండిగో పవన్ రేణిగుంట ఎయిర్‌పోర్టు వద్ద క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పీఏ పవన్‌ని అంటూ పలువురితో పరిచయం చేసుకున్నాడు. ఎయిర్‌పోర్టులో ఉద్యోగాల పేరిట నమ్మించి డబ్బులు తీసుకుని మోసగించేవాడు. ఈ క్రమంలో సోమవారం తాను ఎమ్మెల్యే పీఏనంటూ తిరుపతి రూరల్ మండలం పైడిపల్లికి చెందిన ఓ వ్యక్తికి ఫోను చేసి బేరం పెట్టాడు. ఆ తర్వాత పైడిపల్లి వ్యక్తి చంద్రగిరి ఎమ్మెల్యే పీఏ పవన్‌కు ఫోన్ చేసి.. నగదు ఎంత వేయాలని అడిగారు. ఏం డబ్బులు, ఏం ఉద్యోగం అంటూ అతడిని నాని పీఏ పవన్ ప్రశ్నించగా.. మీ పేరులో కాల్ చేశారంటూ అసలు విషయం చెప్పారు. దీంతో తన పేరిట మోసం చేస్తున్న వ్యక్తిపై పవన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు నిందితుడు అమాస బాలును తిరుచానూరు పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి తెలిపారు. అమాస బాలు ఫోన్ లిస్టును పరిశీలించగా ఓ మాజీ మంత్రితో పాటు వైసీపీ నేతల వాట్సప్‌గ్రూప్‌లో ఉండటం విశేషం. వైసీపీ నేతల ప్రోద్బలంతో ఎమ్మెల్యే పీఏ పేరిట మోసం చేశాడా అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది.



అమాస బాలు అలియాస్ పవన్




కడప జిల్లాలో జరుగుతున్న తెలుగుదేశం ఏడాది పండుగ మహానాడు ఏర్పాట్లలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని,పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ పాలుపంచుకుంటున్నారు. సోమవారం సాయంత్రం మహానాడు సభాప్రాంగణం వద్ద జరుగుతున్న పనులను వారు పర్యవేక్షించారు.బంగారుపాళ్యం మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ ధరణి, పూతలపట్టు నియోజకవర్గ పరిశీలకుడు బొమ్మన శ్రీధర్, చిరంజీవి తదితరులు వారితో పాటు వున్నారు.

## పుల్లూరా ధరలు పతనం



చిత్తూరు సెంట్రల్, మే 26(ఆంధ్రజ్యోతి): పుల్లూరు కాయలకు డిమాండ్ తగ్గిపోవడంతో ధరలు పడిపోయాయి. కాయలు పక్వానికి రాక పోవడం, కోతలు ఒక్కసారిగా చేపట్టడం ధరల పతనానికి కారణంగా తెలుస్తోంది. గత వారంలో టన్ను ధర రూ.12 వేలు పలికిన పుల్లూరు, మూడు రోజుల కిందట రూ.9 వేలకు చేరింది. సోమవారానికి దీని ధర రూ.7 వేలకు పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ ప్రతికూలతలు, వర్షాలు వచ్చాక పంట చేతికి అందదని భావించిన రైతులు కాయలు పక్వానికి రాక ముందే కోతలు చేపట్టారు. తొలుత ధరలు బాగున్నాయని భావించినా, మండీలకు పుల్లూరా పెద్దసంఖ్యలో చేరడంతో ధరలు పతనమయ్యాయి. మరో వైపు పల్ప్ ఫ్యాక్టరీలు సైతం పుల్లూరా రకం కాయలను అడగకపోవడంతో ధరలు పతనం కావడం రైతులను ఆవేదనకు గురిచేస్తోంది. బేనీషా టన్ను రూ.20వేల నుంచి రూ.30 వేల మధ్య పలుకు తుండగా, తాజాగా దీని ధర రూ.15 వేలకు పడిపోయింది. వర్షాలు పడితే కాయలకు పురుగుపడుతుందని భావించిన రైతులు ఒక్క సారిగా కోతలు మొదలు పెట్టడంతో చిత్తూరు, బంగారుపాళ్యం, దామలచెరువు మండీలకు మామిడి కాయలు పెద్ద సంఖ్యలో చేరుతున్నాయి. ఒక వైపు ఎగుమతులు లేకపోవడం, మరో వైపు జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యాలు ప్రస్తుత ధరలకు కొనుగోలు చేయపోవడంతో ధరలు పతనమవుతున్నాయి.

### అందుబాటులోకి రూ.100 నాన్ జ్యుడిషియల్ స్టాంపు పేపర్లు

చిత్తూరు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): కక్షిదారుల సౌకర్యార్థం జిల్లాలో అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.100 విలువగల నాన్ జ్యుడిషియల్ స్టాంపు పేపర్లను అందుబాటులో ఉంచామని జిల్లా రిజిస్ట్రార్ ఎ.వెంకటరమణమూర్తి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నాన్ జ్యుడిషియల్ స్టాంపుల కొరతపై ప్రభుత్వానికి నివేదించడంతో జిల్లాకు రూ.100 విలువ గల 40వేల నాన్ జ్యుడిషియల్ స్టాంపు పేపర్లను పంపిందన్నారు.రోజూవారీ క్రయవిక్రయాలను అంచనా వేస్తూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలవారీగా.. చిత్తూరు అర్బన్‌కు 7,000, చిత్తూరు రూరల్‌కు 4,000, పలమనేరుకు 6,000, పుంగనూరుకు 5,000, కుప్పానికి 6,000, బంగారుపాళ్యానికి 3,000, కార్వేటినగరానికి 3,000 స్టాంపు పేపర్లు తరలించామని తెలిపారు.

### జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్‌కు డీఐజీగా పదోన్నతి

చిత్తూరు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖకు సంబంధించి జిల్లా ఆడిట్ రిజిస్ట్రార్ (మార్కెట్ వేల్యూ)గా ఉన్న ఎం.మునిశంకరయ్యకు ప్రభుత్వం పదోన్నతి కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా డీఐజీగా ఆయనకు పదోన్నతి కల్పించింది. రెండు, మూడ్రోజుల్లో ఆయన రిలీవ్ కానున్నారు. ఈ స్థానంలో తిరుపతి జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామ్ కుమార్‌ను చిత్తూరు జిల్లా ఇన్‌చార్జి డీఆర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆ ఉత్తర్వులో పేర్కొంది.

## ప్రయాణికులు చెయ్యెత్తిన చోట బస్సులు ఆపండి

**ఆర్టీసీ ఎండీ తిరుమలరావు**



సత్యవేడు డిపోలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలరావు

సత్యవేడు/పుత్తూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులు చెయ్యెత్తిన చోట బస్సు ఆపాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు డ్రైవర్లు, కండక్టర్లకు సూచించారు. సోమవారం ఆయన సత్యవేడు, పుత్తూరు డిపోలను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆర్టీసీ ఉద్యోగులకు 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, ఎస్‌బీటీ బకాయిలను చెల్లించామన్నారు. విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రమాద బీమాను రూ.కోటి వరకు పెంచినట్లు వివరించారు. గతంలో రూ.3,000 పింఛను ఇచ్చేవారని ప్రస్తుతం దాన్ని రూ.12,000 పెంచామన్నారు. భవిష్యత్తులో సర్వీసును బట్టి ప్రభుత్వోద్యోగుల తరహాలో పింఛన్లు అందుకుంటారని చెప్పారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు అవసరమైన రూట్లలో సర్వీసులు నడపాలన్నారు. ఈ సందర్భంగా ఇంధన పొదుపులో ప్రతిభ కనబరచిన సత్యవేడు డిపో డ్రైవర్లు వీరయ్య, మధు, సురేష్‌కు ఎండీ ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. కాగా డిపోకు పూర్వ వైభవం తీసుకురావాలని ఎండీ తిరుమలరావును ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. సత్యవేడు నుంచి విజయవాడకు, ఊత్తుకోట్టై మీదుగా చెన్నై, చిత్తూరు, సూళ్లూరుపేట, తిరువళ్లూరుకు సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరారు. పుత్తూరు డిపో నుంచి అమరావతికి, బెంగళూరు, హైదరాబాదు, వేళాంకన్ని, తిరువణ్ణామలైకి సీఎన్‌జీ, విద్యుత్ బస్సులను ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. డిపోలో 140 నుంచి 70 సర్వీసులకు తగ్గిపోయిందని ప్రస్తావించగా... మునుపటి కళను తీసుకువస్తామని అన్నారు. పుత్తూరు బస్టాండుకు రంగులు వేయాలని డిపో మేనేజర్ ప్రశాంతిని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో ఈడీవో పల్లంరాజు, ఈడీఈ చెంగల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈలు శ్రీనివాసులు, బాలాజి, డీఎం వెంకటరమణ, ఎన్‌ఎంయూఏ, ఈయూ, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మండలి బుద్ధప్రసాద్



సురేఖవాణి

## శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, మే 26 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ వెంకటరావు, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ శ్రీహరి రావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి, మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్, సినీనటి సురేఖవాణి, కర్ణాటకకు చెందిన మల్లికార్జున ముత్యా(అప్పాజీ), హైదరాబాద్‌కు చెందిన గోల్డ్ మెన్ కొండ విజయ్‌కుమార్ ఉన్నారు.



కొండ విజయ్‌కుమార్, మల్లిఖార్జున ముత్యా


## సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 8 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లోని 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 91,538

తలనీలాలు సమర్పించినవారు: 37,339





# కాకాణి అరెస్టుతో వెంకటగిరిలో హడావిడి

### తరలివచ్చిన వైసీపీ నేతలు, కార్యకర్తలు ● కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్

వెంకటగిరి, మే 26 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్టుతో సోమవారం వెంకటగిరి పట్టణంలో హడావిడి నెలకొంది. గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరు జిల్లా పోలీసులు రిమాండు నిమిత్తం వెంకటగిరి కోర్టులో హాజరుపరిచారు. దీంతో ఉదయం నుంచే ఉమ్మడి నెల్లూరు జిల్లాకు చెందిన వైసీపీ నేతలు, శ్రేణులు పెద్దసంఖ్యలో ఇక్కడికి తరలి వచ్చారు. వైసీపీ శ్రేణుల నుంచీ ప్రతిఘటన, ఆందోళనలు ఎదురవుతాయేమోనని పోలీసులు ముందు జాగ్రత్తగా కోర్టు పరిసరాల్లో 144 సెక్షన్ విధించడంతో పాటు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో పట్టణంలో సోమవారం హడావిడి, ఉత్కంఠ వాతావరణం నెలకొంది.

నెల్లూరు జిల్లా పొదలకూరు పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి ఏ4 నిందితుడిగా వున్న ఆ జిల్లా వైసీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు ఆదివారం కర్ణాటకలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ఆయన్ను సోమవారం వెంకటగిరి కోర్టులో హాజరుపరిచారు. వాస్తవానికి ఈ కేసు గూడూరు అడిషినల్ ఫస్ట్‌క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు పరిధికి సంబంధించింది. ఆ కోర్టు మేజిస్ట్రేట్ సెలవులో వుండడంతో వెంకటగిరి మేజిస్ట్రేట్ విష్ణు వర్మ గూడూరు కోర్టుకు ఇన్‌చార్జి మేజిస్ట్రేట్‌గా వ్యవహరిస్తున్నారు. ఆ కారణంగా నెల్లూరు పోలీసులు కాకాణిని నెల్లూరు ప్రభుత్వాస్పత్రిలో వైద్యపరీక్షల అనంతరం వెంకటగిరి కోర్టుకు తీసుకొచ్చారు. ఈ విషయం తెలిసి నెల్లూరు జిల్లా అల్లూరు మండలం నుంచీ పెద్ద సంఖ్యలో వైసీపీ కార్యకర్తలు తరలి వచ్చారు. వైసీపీ శ్రేణులు ఆందోళన చేపడతాయనే అనుమానంతో ఉదయం 6 గంటల నుంచే కోర్టు వద్ద భారీగా పోలీసులు మొహరించారు. కోర్టు పరిసరాల్లో 200 మీటర్ల వరకూ 144 సెక్షన్ విధించారు. ఉదయం 11.20 గంటలకు వైసీపీ ముఖ్య నాయకులు కోర్టు వద్దకు చేరుకోగా 11.30 గంటలకు కాకాణిని పోలీసులు కోర్టుకు తీసుకొచ్చి మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. రిమాండు రిపోర్టు పరిశీలించిన మేజిస్ట్రేట్ విచారణ మొదలు పెట్టి ఇరువైపుల వాదనలు విన్నారు. ప్రాసిక్యూషన్ తరపున గూడూరు కోర్టు ఏపీపీ కేదార్‌నాథ్.. మాజీ మంత్రి తరపున న్యాయవాదులు విజయ్‌కుమార్‌రెడ్డి, రోజా రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి వాదనలు వినిపించారు. లంచ్ బ్రేక్ అనంతరం 3.10 గంటల సమయంలో మేజిస్ట్రేట్ కాకానికి 14 రోజుల పాటు రిమాండు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



కోర్టు నుంచి కాకాణి గోవర్ధన్ రెడ్డిని బయటకు తీసుకొస్తున్న పోలీసులు



కోర్టు వద్ద నుంచి జనాన్ని పంపిస్తున్న డీఎస్పీ గీతాకుమారి, సీఐ ఏవీ రమణ

#### విచారణ జరిగింతసేపూ చేతులు కట్టుకునే..

సోమవారం ఉదయం 11.30 నుంచీ మధ్యాహ్నం 3.10 గంటల దాకా మధ్యలో భోజనం విరామం మినహా విచారణ జరిగింతసేపూ కోర్టులో మాజీ మంత్రి కాకాణి చేతులు కట్టుకుని నిలబడే ఉన్నారు. మేజిస్ట్రేట్ రిమాండు విధించాక పక్కనున్న గదిలోకి వెళ్ళి కూర్చున్నారు. రిమాండు ఉత్తర్వులు వచ్చాక కాకాణి తరపు న్యాయవాదులు జైల్లో ఆయనకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరుతూ పిటిషన్ వేశారు.

**వైసీపీ శ్రేణుల్లో ఉత్కంఠ :** కాకాణి గోవర్ధన్‌రెడ్డికి రిమాండు విధిస్తారా లేక బెయిల్ మంజూరవుతుందా అని వైసీపీ శ్రేణులు ఉత్కంఠగా వేచి చూశాయి. పోలీసు ఆంక్షల కారణంగా శ్రేణులు కోర్టుకు దూరంగా వుండిపోగా ముఖ్య నాయకులు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేరిగ మురళీధర్, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు కోర్టు హాలులోను, మిగిలి ద్వితీయ శ్రేణి నేతలు కోర్టు ఆవరణలో గడిపారు. వారంతా మేజిస్ట్రేట్ నిర్ణయం కోసం ఆత్రుతగా నిరీక్షించారు. చివరికి రిమాండు విధించడంతో ఉసూరుమంటూ వెనుదిరిగారు. మొత్తానికీ కాకాణిని వెంకటగిరి కోర్టుకు తీసుకురావడంతో పట్టణంలో హడావిడి, ఉత్కంఠ నెలకొంది.

## 10న ఆర్టీసీ వైద్యశాల ప్రారంభం?

### సిద్ధం చేయాలన్న ఆర్టీసీ ఎండీ



వైద్యశాల నిర్మాణంపై ఆరా తీస్తున్న ఎండీ ద్వారక తిరుమలరావు

తిరుపతి(ఆర్టీసీ), మే 26(ఆంధ్రజ్యోతి): అలిపిరి డ్రైవర్స్ క్వార్టర్స్‌లో నిర్మిస్తున్న వైద్యశాలను జూన్ 10వ తేదీన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ ద్వారక తిరుమలరావు అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన రూ.4కోట్లతో నిర్మిస్తున్న డిస్పెన్సరీ, విశ్రాంతి భవనాన్ని పరిశీలించారు. పనులు ఆలస్యంగా జరుగుతుండడంతో కాంట్రాక్టర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. వేగవంతం చేయాలని ఆదేశించారు. వచ్చేనెల తొలివారంలో పూర్తవ్వాలన్నారు. భవన నిర్మాణ వివరాలను ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. శ్రీవారి పాదాల చెంత నిర్మితమవుతున్న ఈ భవనం ప్రస్తుత, విశ్రాంత ఉద్యోగులకు సౌకర్యంగా ఉండాలన్నారు. సకల సదుపాయాలు కల్పించాలన్నారు. ఆహ్లాదకరంగా ఉండేలా గ్రౌండ్‌ఫ్లోర్‌లో పచ్చదనం పెంచాలన్నారు. ఆస్పత్రికి అవసరమైన మౌలిక సదుపాయాలు కొరత లేకుండా ఏర్పాటు చేయాలన్నారు. చివరి రెండు అంతస్తుల్లో విశ్రాంతి గదులు పూర్తిచేయడానికి మరో నెలన్నర పడుతుందని కాంట్రాక్టర్ తెలియగా ఆలోపే పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీలు అప్పలరాజు, చెంగల్ రెడ్డి, చంద్రశేఖర్, డీపీటీవో వెంకటరావు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఈ చెన్న కేశవులు, ఈఈ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవారి భక్తులకు జూన్ నుంచి టికెట్ రిజర్వేషన్ సౌకర్యం

తిరుపతి(సెంట్రల్), మే 26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనం కోసం ఆగస్టు నెలలో టికెట్లు కొన్న భక్తులకు జూన్‌లో ప్రయాణపు టికెట్‌లు రిజర్వేషన్ చేసుకునే వసతిని రైల్వే శాఖ కల్పించిందని తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు టీటీడీ, రైల్వేశాఖల ఉన్నతాధికారులు చర్చలు జరిపి నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. దర్శనం టికెట్లు కొని రైలు రిజర్వేషన్ ఖరారు కాని వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. తిరుమలకు వచ్చే భక్తుల కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతోందన్నారు.




శ్రీసిటీ అధికారులతో థాయ్ బృందం

## శ్రీసిటీని సందర్శించిన థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్

శ్రీసిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): చెన్నైలోని థాయ్‌లాండ్ కాన్సుల్ జనరల్ రాచా ఆరిబార్గ్ తన సతీమణి నరఫాన్ ఆరిబార్గ్‌తో కలిసి రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం శ్రీసిటీకి విచ్చేశారు. వారికి శ్రీసిటీ ఆపరేషన్స్ ప్రెసిడెంట్ సతీష్ కామత్ సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక వాతావరణం, వ్యాపార ప్రయోజనాల గురించి వారికి వివరించారు. భారత్ - థాయ్‌లాండ్ మధ్య వ్యాపార సంబంధాలను పెంపొందించడంలో ఈ పర్యటన కీలకపాత్ర పోషిస్తుందని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో తెలిపారు. థాయ్ కాన్సుల్ జనరల్ తన పర్యటనలో భాగంగా తొలి రోజు శ్రీసిటీ అధికారులతో చర్చలు, సెజ్ పరిసరాలతో పాటు థాయ్ పరిశ్రమలైన రాక్‌వర్త్, మాండలెజ్ పరిశ్రమలను సందర్శించి ఆయా పరిశ్రమల ప్రతినిధులతో సమావేశమయ్యారు.

### రేపు బర్డ్ డైరెక్టర్ బాధ్యతల స్వీకరణ

తిరుపతి, మే 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని బాలాజీ వికలాంగుల శస్త్రచికిత్స, పరిశోధన, పునరావాస కేంద్రం (బర్డ్) డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సూచనలతో ఈనెల 2న బర్డ్ డైరెక్టర్‌గా జగదీష్‌ను నియమిస్తూ టీటీడీ ఈవో శ్యామలరావు ప్రొసీడింగ్స్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బర్డ్ ఆస్పత్రి పాత భవనంలో ఇదివరకున్న డైరెక్టర్ ఛాంబర్‌ను సిద్ధం చేశారు. ఈనెల 28న బర్డ్‌ను స్థాపించిన దివంగత నేత ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించి జగదీష్ బాధ్యతలు తీసుకోనున్నట్టు తెలిసింది.

### గంజాయి స్వాధీనం

#### పోలీసుల అదుపులో ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లు

శ్రీకాళహస్తి,మే26(ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కదలికలపై పక్కా సమాచారంతో పోలీసులు మాటు వేసి ముగ్గురు అంతర్రాష్ట్ర స్మగ్లర్లను అదుపులోకి తీసుకున్నారు. సోమవారం శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని చెన్నై రహదారిలో గంజాయి రవాణా సాగుతున్నట్లు సమాచారం అందుకున్న శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీసులు మాటు వేసి ముగ్గురుని అదుపులోకి తీసుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం.

### రైలు ఢీకొని పాడి రైతు మృతి

బాలాయపల్లి, మే 26 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని పాడిరైతు మృతిచెందిన సంఘటన మండలంలోని పిగిలాం గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పిగిలాం గ్రామానికి చెందిన అమ్మినేని నాగయ్య (59) అనే రైతు గేదెలను వెతికే క్రమంలో ఆదివారం గ్రామ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండా ప్రమాదవశాత్తూ రైలు ఢీకొనడంతో మృతిచెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా నాగయ్యకు వినిడిలోపం ఉండడంతో రైలు రావడాన్ని గుర్తించకపోవడంతో ప్రమాదానికి గురై మృతిచెంది ఉంటాడని స్థానికులు భావిస్తున్నారు.

### డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ, పద్మావతి డిగ్రీ కాలేజీలకు సంబంధించిన డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలు విడుదలయ్యాయి. స్వయం ప్రతిపత్తి గల ఈ రెండు కాలేజీలు సొంతంగానే పరీక్షలు నిర్వహించి, ఫలితాలు వెల్లడించాయి. ఫలితాలను ఆయా కాలేజీల అధికారులు సోమవారం విడుదల చేశారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీకి సంబంధించిన ఫలితాలు ఎస్‌వీఏసీ.ఎడ్యూ.ఇన్.. వెబ్‌సైట్‌లో చూడవచ్చు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో 88.05 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు ప్రకటించారు. పద్మావతి డిగ్రీ కాలేజీలో 92 శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ నారాయణమ్మ తెలిపారు.

# వ్యవసాయ శాఖ కౌన్సెలింగ్‌లో ఇష్టారాజ్యం

### జాబితాలో ముందున్న వారికే రిక్వెస్ట్ బదిలీలు - కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులే చెల్లుబాటు





కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీ శ్రీధర్ కౌన్సెలింగ్ హాల్ బయట ఎదురుచూస్తున్న అధికారులు

అనంతపురం అర్బన్, మే 26(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ అధికారులు, ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో గందరగోళం నెలకొంది. అనంతపురం జేడీ కార్యాలయంలో ఉమ్మడి అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు సంబంధించి ఏడీలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సెలింగ్ సోమవారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు (ఏడీ) శ్రీధర్ నేతృత్వంలో ఆయా జిల్లాల జేడీఈ లు ప్రక్రియలో పాల్గొన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నందాకా సీనియర్ అసిస్టెంట్లు, ఏడీలు, మధ్యాహ్నం నుంచి రాత్రిదాకా ఏఓలకు బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించారు. నాలుగు ఉమ్మడి జిల్లాల అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరు కావడంతో జేడీ కార్యాలయ ఆవరణలో సందడి నెలకొంది. ఒకే చోట ఐదేళ్ల సర్వీస్ పూర్తిచేసిన వారితో పాటు రిక్వెస్ట్ కింద పలువురు ఉద్యోగులు బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఐదేళ్లు పూర్తయిన అధికారులు, ఉద్యోగులను వారు ఇచ్చిన మూడు ఆప్షన్లలో ఒక స్థానాన్ని ఖరారు చేసినట్లు సమాచారం. రిక్వెస్ట్ కింద బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో కొందరికే బదిలీ జరిగినట్లు తెలుస్తోంది. ఆన్‌లైన్ జాబితాలో ముందున్న కొందరికే రిక్వెస్ట్ బదిలీకి అంగీకరించారు. ఆ తర్వాత జాబితాలోని అధికారులు, ఉద్యోగులను నిర్ధాక్షిణ్యంగా కౌన్సెలింగ్‌లో చెప్పుకునేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు క్యాడర్లలో ఐదేళ్లు పూర్తి కాని స్థానాలకు ఇతర అధికారులను బదిలీ చేసేందుకు అంగీకరించినట్లు తెలిసింది. ఇదే తరహాలో దరఖాస్తు చేసుకున్న మరి కొందరు అధికారుల దరఖాస్తులను పక్కన పెట్టినట్లు సమాచారం. కొందరు ప్రజాప్రతినిధుల సిఫార్సులను ఓకే చేసి.. అక్కడికక్కడే అధికారులకు స్థానాలను ఖరారు చేసి పంపినట్లు సమాచారం. మరికొందరి సిఫార్సులను బుట్టదాఖలు చేశారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముందస్తు మేనేజ్ నేపథ్యంలోనే పలువురు అధికారులను వారు కోరుకున్న స్థానాలకు పంపకుండా ఆపేసినట్లు చర్చ సాగుతోంది. ఏడీలు, ఏఓలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు రాష్ట్రస్థాయిలో ఫైనల్ చేస్తారు. ఏడీ నేతృత్వంలోని కమిటీ సిఫార్సులనే దాదాపుగా రాష్ట్ర ఉన్నతాధికారులు ఓకే చేసే పరిస్థితి ఉంది. ఇక్కడ తమకు అన్యాయం జరిగిందని భావించిన అధికారులు, ఉద్యోగులు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులను కలిసే అవకాశం ఉన్నా.. అక్కడికి వెళ్లేవారు తక్కువేనన్న వాదనలు వినిపిస్తున్నాయి.వ్యవసాయ శాఖ యూనియన్లలో ఆఫీస్ బేరర్లుగా ఉన్న అధికారులకు, ఉద్యోగులకు కూడా చేదు అనుభవం ఎదురైనట్లు తెలిసింది. ఆఫీస్ బేరర్లు.. కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంది. బదిలీల సమయానికి కలెక్టరేట్ నుంచి ప్రొసీడింగ్స్. కమిటీకి అందకపోవడంతో తమకు ఏ స్థానం కేటాయిస్తారోనన్న సందేహాలను ఆ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

#### దరఖాస్తు చేయకపోయినా..

వ్యవసాయశాఖలో బదిలీకోసం దరఖాస్తు చేయనివారికి సైతం స్థాన చలనం కలుగుతోంది. ఒక స్థానాన్ని అయినవారికి కేటాయించేందుకు అక్కడున్నవారిని కదిలిస్తున్నారు. ఏమాత్రం సమాచారం ఇవ్వకుండా, వారి అంగీకారాన్ని అడగకుండా బదిలీ చేసేస్తున్నారు. ఈ జాబితాలో కేవలం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారు, చార్జెస్ ఉన్నవారు కూడా ఉండడం గమనార్హం. అయినవారికి ఇవ్వాలనుకుంటే తమకు సమాచారమైనా ఇవ్వాలి కదా..? చెప్పాపెట్టకుండా ఎలా బదిలీ చేస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చేక్రమంలో తమను బలిపశువులను చేస్తున్నారని మండిపడుతున్నారు. ఈ తతంగానికి జేడీ కార్యాలయం వేదికైంది. కౌన్సెలింగ్ ప్రక్రియను సోమవారం రాత్రి తలుపులు వేసుకుని మరీ కానిచ్చేశారు. ఈ అక్రమాల వెనుక ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక ఆ శాఖ ఉన్నతాధికారుల అక్రమాలు ఉన్నాయా అన్న చర్చ జరుగుతోంది.



కౌన్సెలింగ్‌కు హాజరైన వ్యవసాయ అధికారులు, ఉద్యోగులు

## ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, మే 26(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. వేసవి సెలవులతో పాటు అమావాస్య ఘడియలు కలిసి రావడంతో రెండు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 30 వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 548 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 3,139, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 3,220మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,497మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,331, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 387, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 246, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 76మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 24,991 అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## అల్లకల్లోలంగా సముద్రం



తూపిలిపాళెం సముద్ర తీరంలో ఎగిసిపడుతున్న అలలు

నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండంతో వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రం అల్లకల్లోలంగా మారింది. సముద్రం నుంచి వీస్తున్న గాలులకు భారీ కెరటాలు ఉవ్వెత్తున ఎగిసిపడుతున్నాయి. ఆదివారం మధ్యాహ్నం నుంచి వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. తూపిలిపాళెం, శ్రీనివాసపురం, మనపాళెం, వైట్‌కుప్పం తీరాలలో వాయుగుండం ప్రభావంతో సముద్రం ముందుకువచ్చిందని మత్స్యకారులు సోమవారం తెలిపారు. వాయుగుండం ప్రభావంతో రెండు గంటలపాటుగా ఎడతెరపిలేకుండా వర్షం పడింది.

- వాకాడు, ఆంధ్రజ్యోతి

## వరసిద్ధుడి సేవలో న్యాయమూర్తులు



చిత్తూరు జిల్లా న్యాయమూర్తి జస్టిస్ అరుణసారికకు జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో రవీంద్రబాబు

ఐరాల(కాణిపాకం), మే 26 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధుడిని సోమవారం చిత్తూరు జిల్లా కోర్టు న్యామూర్తి జస్టిస్ అరుణసారిక, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ.ఇంద్రేష్ దర్శించుకున్నారు. వీరు స్వామిని వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి దర్శన ఏర్పాట్లను చేశారు. తీర్థప్రసాదాలను అందజేశారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సబ్సిడీ రుణాలతో దళితులు అభివృద్ధి చెందాలి

● మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ శ్రీదేవి



మీడియాతో మాట్లాడుతున్న శ్రీదేవి

చిత్తూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని దళితులు ఆర్థికంగా ఎదగాలని మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి కోరారు. సోమవారం ఎస్సీ కార్పొరేషన్ కార్పొరేషన్ కార్యాలయంలో ఈడీ చెన్నయ్యతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక దళితులు అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతున్నారు. ఇటీవల మాల, మాదిగల అభివృద్ధి కోసం ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రూ.92కోట్ల సబ్సిడీతో 2221 యూనిట్లను ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో జిల్లాలో రూ.242 కోట్లతో నాలుగు లక్షల మందికి వివిధ రకాల ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. వాహనాలకు డ్రైవర్లుగా ఉన్న దళిత యువకులను ఓనర్లుగా మార్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. గతంలో మంత్రిగా ఉన్న లోకేశ్ నాలుగు వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే, అందులో ఎక్కువ భాగం దళితవాడల్లోనే ఉన్నాయని తెలిపారు. జనాభా ప్రాతిపదికన అన్నదమ్ములుగా ఉన్న మాల, మాదిగలను అభివృద్ధి చేయడానికి ఎస్సీ విభజన జరిగిందన్నారు. ఈ విభజన తర్వాత మాదిగలు కూడా సంతోషంగా ఉన్నారని తెలియజేశారు. అదే వైసీపీ హయాంలో మాల, మాదిగలు నిరాదరణకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు.

### మహానాడుకు
## టీడీపీ సభ్యత్వ కార్డు తీసుకెళ్లండి

● నేడు చిత్తూరు ఎమ్మెల్యే ఇంటినుంచి కడపకు ర్యాలీగా వెళ్లనున్న పార్టీ శ్రేణులు

చిత్తూరు సిటీ, మే 26 (ఆంధ్రజ్యోతి): కడపలో మంగళవారం నుంచి జరగనున్న టీడీపీ మహానాడుకు చిత్తూరు నియోజకవర్గం నుంచి తెలుగు తమ్ముళ్లు వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో సుమారు 35 బస్సులు, 120 కార్లలో టీడీపీ నేతలు, కార్యకర్తలు బయల్దేరనున్నారు. మంగళవారం ఉదయం ఆరు గంటలకు చిత్తూరు బీవీరెడ్డి కాలనీలోని ఆయన ఇంటి వద్ద నుంచి వీరంతా ర్యాలీగా కడపకు వెళతారు. కాగా, మహానాడుకు హాజరవడానికి ఎటువంటి పాసులు అవసరం లేదని, టీడీపీ సభ్యత్వ కార్డు ఉంటే సరిపోతుందని ఎమ్మెల్యే తెలిపారు. కొత్త కార్డు లేనివారు పాత సభ్యత్వ కార్డు లేదా ఓటరు కార్డు, లేదా మొబైల్ నెంబరు చెప్పి అక్కడ రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

## సచివాలయంలో కంప్యూటర్ చోరీ

శ్రీరంగరాజపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్‌పురం మండలం 49.కొత్తపల్లె గ్రామ సచివాలయంలో కంప్యూటర్‌ను ఆదివారం రాత్రి చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారి పక్కన ఉన్న గ్రామ సచివాలయ భవనానికి ఉన్న తాళం పగలగొట్టి దుండగులు లోనికి ప్రవేశించారు. అక్కడున్న కంప్యూటర్, రెండు ప్రింటర్లను ఎత్తుకెళ్లారు. పంచాయతీ కార్యదర్శి బాలరాజు సోమవారం ఉదయం సచివాలయానికి రాగా చోరీ విషయం బయటపడింది. ఆయనిచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలను సేకరించారు. గతంలో సచివాలయం సమీపంలో తాగునీటి బోరు మోటర్లు కూడా చోరీ అయ్యాయని స్థానికులు తెలిపారు. ఇకనైనా చోరీలు జరగకుండా పోలీసుల నిఘా పెంచాలని విన్నవిస్తున్నారు.

## పట్టపగలు.. దొంగ హల్‌చల్

● ఇళ్ల తాళాలు పగులగొడుతుండగా స్థానికులు కేకలు పెట్టడంతో పరారీ

పూతలపట్టు, మే 26 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు మండలంలోని కొత్తకోట వద్ద పట్టపగలే ఓ దొంగ హల్‌చల్ చేయడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఓ గుర్తుతెలియని యువకుడు చిన్నపాటి గడ్డపారను చేతిలో పట్టుకుని కొత్తకోటలో తాళం వేసి ఉన్న ఓ రైతు ఇంటి తాళాలను పగులగొడుతుండగా పక్కింటివారు గమనించి అరవడంతో పరారయ్యాడు. అదే యువకుడు కొద్దిసేపటికే వసంతాపురం దళితవాడలోని కృష్ణమూర్తి అనే వ్యక్తి ఇంటి తాళాలను పగులకొడుతుండగా స్థానికులు కేకలు పెట్టడంతో అక్కడినుంచి కూడా పరారయ్యాడు. ఈ విషయం చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు తెలియడంతో వారు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

### పులిచెర్ల మండలాన్ని
# తిరుపతి లేదా చిత్తూరు జిల్లాలో కలపాలి

● టీడీపీ నేతల డిమాండ్

● కలెక్టరేట్‌లో జరిగిన 'పీజీఆర్‌ఎస్'కు 206 అర్జీలు

చిత్తూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలాన్ని తిరుపతి లేదా చిత్తూరు జిల్లాలో కలపాలని ఆ మండలానికి చెందిన టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో డీఆర్వో మోహన్‌కుమార్‌కు అర్జీ అందజేశారు. టీడీపీ నేత రామనాథంనాయుడు మాట్లాడుతూ.. గతంలో పులిచెర్ల మండలం చంద్రగిరి నియోజకవర్గంలో ఉండేదన్నారు. జిల్లాల విభజన సమయంలో పుంగనూరు నియోజకవర్గంలో కలిపారన్నారు. వారం కిందట కలెక్టర్ విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో పులిచెర్ల మండలాన్ని అన్నమయ్య జిల్లాలో కలిపారన్నారు. పనుల నిమిత్తం పులిచెర్ల నుంచి అన్నమయ్య జిల్లాకు వెళ్లడం కష్టంతో కూడుకున్నదన్నారు. పులిచెర్ల మండలాన్ని చిత్తూరు జిల్లాలోనే ఉంచాలని, లేనిపక్షంలో తిరుపతి జిల్లాలో కలపాలన్నారు. త్వరలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళతామని చెప్పారు. కాగా, బాధితుల నుంచి అర్జీలను డీఆర్వోతోపాటు డిప్యూటీ కలెక్టర్లు అనుపమ, విజయలక్ష్మి, పలువురు జిల్లా అధికారులు స్వీకరించారు. మొత్తం 266 అర్జీలు వచ్చాయి. వీటిల్లో.. రెవెన్యూశాఖకు 204, పోలీసుశాఖకు 15, డీఆర్‌డీఏకు 18, పంచాయతీరాజ్‌కు 4, విద్యుత్‌శాఖకు 7, మిగిలిన శాఖలకు 18 అర్జీల చొప్పున ఉన్నాయి.

### ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలి



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ప్రతిపాదనలను మానుకుని.. ఇది వరకు తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్, సీఐటీయూ నేత గంగరాజు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పిన నేతలు ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. ప్రాణత్యాగాలు చేసి తెచ్చుకున్న ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లక్షలాది మంది ఆధారపడే విశాఖ ఉక్కును ప్రభుత్వ ఆధీనంలోనే నడపాలని కోరారు. ఏఐటీయూసీ నేతలు మణి, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

### పశువుల మేత భూమి కబ్జా



అర్జీని పరిశీలిస్తున్న డీఆర్వో మోహన్‌కుమార్

ఎస్‌ఆర్‌పురం మండలం ఏఎంపురం ఆది ఆంధ్రవాడ, ఏఎంపురం గ్రామాల వద్ద ఉన్న పశువుల మేత భూమిని ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు కబ్జా చేస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. జయరామనాయుడు, శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ ఈ రెండు గ్రామాలకు సమీపంలోని కొక్కిరాళ్లకొండ వద్ద 1102 ఎకరాల విస్తీర్ణంలో ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ మొత్తం భూమిలో సర్వే నెంబరు 170లో ఉన్న 18.02 ఎకరాలు పశువుల మేత భూమిగా ఉందన్నారు. ప్రస్తుతం ఈ భూమికి దొంగ పట్టాలు సృష్టించి కబ్జాకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ విషయాన్ని తహసీల్దార్, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

### శ్మశాన భూమిని కాపాడండి

శ్మశాన భూమిని కాపాడాలని జీడీ నెల్లూరు మండలం ఎస్‌ఎస్ కొండ ఆది ఆంధ్రవాడ గ్రామస్తులు కోరారు. శ్మశానానికి ఉన్న రెండెకరాల్లో ఒకటిన్నర ఎకరాలను ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడని, విచారించి చర్యలు తీసుకోవాలన్నారు.







కలెక్టరేట్‌కు వచ్చిన పులిచెర్ల మండలానికి చెందిన టీడీపీ నాయకులు - ఎస్‌ఆర్‌పురం మండలం ఏఎంపురం గ్రామస్తులు - జీడీ నెల్లూరు మండలం ఎస్‌ఎస్ కొండ ఆది ఆంధ్రవాడవాసులు

# పులిచెర్లను మదనపల్లెలో కలపొద్దు

● మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం



ఎంజేఆర్ కళాశాల వద్ద లోకేష్ అభివాదం

కల్లూరు, మే 26(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలాన్ని అన్నమయ్య జిల్లా మదనపల్లి రెవెన్యూ డివిజన్‌లో కలపవద్దంటూ మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. సోమవారం రాత్రి కుప్పం నుంచి కడప మహానాడుకు వెళుతున్న ఆయనకు దిగువపోకలవారిపల్లి పంచాయతీ ఎంజేఆర్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. లోకేష్ వీనిజ కారును ఆపి ఆప్యాయంగా పలుకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు రామనాథంనాయుడు మంత్రికి వినతిపత్రం అందజేశారు. చిత్తూరుకు 40కిలో మీటర్ల దూరంలో ఉన్న తమ మండలాన్ని 80 కిలోమీటర్ల దూరంలోని అన్నమయ్య జిల్లా మదనపల్లి రెవెన్యూ డివిజన్‌లో కలపాలని నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. దీంతో మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. పునఃపరిశీలించి చిత్తూరు రెవెన్యూ డివిజన్‌లో కొనసాగించాలని కోరారు. ఈ అంశాన్ని పరిశీలిస్తామని లోకేష్ హామీ ఇచ్చారు. కాగా అయ్యావాండ్లపల్లి పంచాయతీ యర్రంవాండ్లపల్లి బస్టాప్ వద్ద స్థానిక టీడీపీ నాయకులు మహేష్, కిరణ్‌కుమార్ తదితరులు మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికారు. నాయకులు రవిమోహన్‌నాయుడు, మురళీధర్‌నాయుడు, శ్రీనివాసులునాయుడు, గోపీనాయుడు, ధనంజయనాయుడు, బండ్ల రమేష్, పార్థసారథి, మోహన్‌దాస్, రమేష్, నాగరాజనాయుడు, శంకర్, దేవ, కిషోర్, తేజ, జయచంద్రనాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్లలోగా కంపెనీల ప్రాజెక్టులు పూర్తి చేయండి

● శ్రీజ డెయిరీ యాజమాన్యానికి సీఎం చంద్రబాబు సూచన

కుప్పం, మే 26 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ప్రతిపాదిత కంపెనీల ప్రాజెక్టులను రెండేళ్లలోగా పూర్తి చేయాలని శ్రీజ డెయిరీ యాజమాన్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. కుప్పం పర్యటనలో ఉన్న చంద్రబాబును యాజమాన్య ప్రతినిధులు సోమవారం ఉదయం ఆయన స్వగృహంలో కలిశారు. శ్రీజ డెయిరీ, పశుగ్రాస ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకోసం శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీ పరిధిలోని చెత్తగుట్ట వద్ద ఇప్పటికే సుమారు 20 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది.ఈ ప్రాజెక్టులను 15-18 నెలల్లోగా పూర్తి చేయాలని సీఎం వారిని కోరారు. అలాగే మదర్ డెయిరీ పండ్ల గుజ్జు ప్రాసెసింగ్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని సూచించారు. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తం 8 వేల ఉద్యోగాలు సృష్టి కావాలన్నారు.కాగా కడాతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా శ్రీజ డెయిరీ కుప్పం నియోజకవర్గంలో ప్రాజెక్టుల స్థాపనకు ముందుకొచ్చింది.

## రుయాలో ప్రత్యేక టీబీ నిర్ధారణ కేంద్రం



టీబీ స్క్రీనింగ్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవిప్రభు

తిరుపతి(వైద్యం), మే 26 (ఆంధ్రజ్యోతి): వైద్యులు, వైద్య సిబ్బంది ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వారిని క్షయ నుంచి రక్షించేందుకు చర్యలు చేపట్టడం శుభపరిణామమని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రభు పేర్కొన్నారు. వైద్యులు, వైద్య ఉద్యోగుల కోసం రుయాస్పత్రిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్షయ వ్యాధి నిర్ధారణ కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి క్షయ వ్యాధి బాధితుల నుంచి వెంటనే వస్తుందని, తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం ఏఆర్ఎంవో హరికృష్ణ క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడమేగాక టీకా వేసుకుని వైద్య సిబ్బందికి స్ఫూర్తినిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రాధ, పల్మనరీ విభాగాధిపతి సుబ్బారావు, డీసీఎస్ఆర్ఎంవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏవో తిరుపతికి బదిలీ

తిరుపతి(వైద్యం), మే 26 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ వైద్య కళాశాలలో అనాటమీ విభాగంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ సీ యామినిని తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు, కడపలోని వేంపల్లి పీహెచ్‌సీలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ యు.బి.లక్ష్మీప్రియను జిల్లాలోని గొల్లపల్లికి పీహెచ్‌సీకి బదిలీ చేస్తూ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ మంజుల సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏవో(అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్)గా విధులు నిర్వహిస్తున్న వై.పద్మజను ఎస్వీ వైద్య కళాశాల ఏవోగా బదిలీ చేశారు.

### మహానాడుకు ఉచిత అంబులెన్సులు

తిరుపతి(వైద్యం), మే 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కడపలో మూడు రోజులపాటు నిర్వహించే మహానాడు కార్యక్రమానికి ఉచిత వైద్య సేవలు అందించేందుకు స్విమ్స్‌లోని శ్రీబాలాజీ అంబులెన్స్ సర్వీస్ సొసైటీ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 17 అంబులెన్సులు సోమవారం వెళ్లాయి. అంబులెన్సుల్లో అత్యవసర వైద్య సహాయం అందించే అనుభవజ్ఞులతోపాటు అవసరమైన మందులను తీసుకువెళ్లారు. మూడు రోజులపాటు అంబులెన్సులు అక్కడే ఉండి అవసరమైన వైద్య సహాయ సహకారాలు అందిస్తాయని బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. అంబులెన్సుల డ్రైవర్లు, సహాయకులు స్వచ్ఛందంగా ముందుకు రావడం సంతోషకరమన్నారు.

## చంద్రబాబు కోసం...



ముస్లిం పెద్దలతో కలిసి దువా చేస్తున్న సీఎం చంద్రబాబు

కుప్పం, మే 26 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నూతన గృహప్రవేశాన్ని పురస్కరించుకుని ముస్లిం మైనారిటీ పెద్దలు ఆయన కుటుంబ క్షేమాన్ని ఆకాంక్షిస్తూ అల్లాకు దువా చేశారు. టీడీపీ మైనారిటీ సెల్ నాయకులు అన్సర్‌బాషా, సర్దార్‌బాషా, జాకిర్ ఆధ్వర్యంలో ముస్లిం పెద్దలు సోమవారం ఉదయం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. చంద్రబాబుకు, ఆయన కుటుంబ సభ్యులకు ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధి కలిగించాలని, శుభాలు కలగాలని దువా చేశారు.

## ఆడిట్‌పై సింగిల్ విండోల సీఈవోలకు శిక్షణ



శిక్షణా తరగతుల్లో ప్రసంగిస్తున్న డీసీసీబీ సీఈవో శంకర్ బాబు

చిత్తూరు కలెక్టరేట్, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘా(సింగిల్ విండోలు)ల్లో ఇకపై ఆడిట్‌ను ఆన్‌లైన్‌లోనే నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు తెలిపారు. సోమవారం స్థానిక బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఆడిట్‌పై సింగిల్ విండోల సీఈవోలు, కంప్యూటర్ ఆపరేటర్లకు రెండ్రోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు. ఇకపై అన్ని సొసైటీల్లోనూ 'ఈ - పీఏసీఎస్' (సేవలు) ద్వారా సేవలందిస్తున్నట్లు చెప్పారు. పుస్తకాలతో పనిలేకుండా ఆన్‌లైన్‌లోనే ఎంట్రీలు నమోదు చేయాలని చెప్పారు. ఆప్కాబ్, డీసీసీబీ శాఖల తరహాలోనే కోర్ బ్యాంకింగ్ సొల్యూషన్ (సీబీఎస్) మాడ్యూల్‌లో ఆయా ప్రక్రియలు సాగుతాయన్నారు. ఆప్కాబ్ ఏజీఎం అశోక్, డీసీసీబీ డీపీడీఎం సంధ్య, ఎన్‌పీఎల్‌ఎస్‌వీ నెట్ ప్రతినిధి విజయ్ సారథిలు ట్రైనర్లుగా వ్యవహరించారు. మంగళవారంతో ఈ శిక్షణ కార్యక్రమం ముగియనుంది. బ్యాంకు జనరల్ మేనేజర్లు మనోహర్ గౌడ్, వెంకటాచలపతి, లిల్లీకేథరిన్, ఏజీఎం సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# టీడీపీ శ్రేణుల జోలికి వస్తే తీవ్ర పరిణామాలు

● పుంగనూరు ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి హెచ్చరిక



కడపకు శ్రీకాకుళం టీడీపీ కార్యకర్తల సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం శ్రేణుల జోలికి వస్తే ఎంతటివారైనా తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి హెచ్చరించారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో పుంగనూరు మండలం సుగాలిమిట్టలో అవమానం పాలైన శ్రీకాకుళం తెలుగు తమ్ముళ్లను ఆయన సోమవారం సత్కరించారు.టీడీపీ జాతీయ అధ్యక్షుడు, అప్పటి విపక్ష నేత అయిన చంద్రబాబును 2023వ సంవత్సరంలో వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేసి జైల్లో పెట్టిన విషయం తెలిసిందే.ఇందుకు నిరసనగా 2023 అక్టోబరు 2వ తేది శ్రీకాకుళం జిల్లా రణస్థల మండలం నార్వ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు, మాజీ సర్పంచ్ రామకృష్ణ, చల్లా రామసూర్య, ఆదినారాయణ, నేలపు సుందర్‌రావు, ఎస్.రమేశ్ నల్ల బ్యాడ్జీలతో సైకిల్‌యాత్ర చేపట్టారు.అందులో భాగంగా పుంగనూరు మండలం సుగాలిమిట్టకు చేరుకున్న వారు సైకిళ్లు పక్కన పెట్టి టీ తాగుతుండగా అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అనుచరుడు చెంగళాపురం సూరి, మరికొందరు కారులో వచ్చి వారిపై దౌర్జన్యానికి దిగారు. పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ జెండా కనిపించడం ఏమిటంటూ సైకిళ్లకు కట్టిన జెండాలు, చంద్రబాబు ఫొటోలు తీయించారు. చివరకు వారు ధరించిన పసుపు బట్టలు కూడా ఊడదీయించారు. ఇది పెద్దిరెడ్డి ఇలాకా ఇక్కడ వైసీపీ తప్ప ఏ జెండా ఉండరాదని దౌర్జన్యం చేసి కొట్టి అవమానించారు.ఇంత జరుగుతున్నా సుగాలిమిట్టలో ఎవరూ ఇది తప్పు అని చెప్పకపోగా కొందరు చెంగళాపురం సూరిని మంచి పనిచేశావంటూ అభినందించారు. బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని భయంతో పలమనేరు వెళుతుండగా మీడియా వారిని పలకరించి జరిగిన ఘటన రికార్డు చేయగా టీడీపీ నాయకులు శ్రీకాంత్, సీవీరెడ్డి, పోలీసుగిరి తదితరులు ధైర్యం చెప్పి కొంత ఆర్థిక సహాయం చేసి పలమనేరు నేతలతో మాట్లాడి పంపారు. ఈ విషయం మీడియాలో రావడంతో నాటి పోలీసులు తొలగించిన రౌడీషీట్‌ను మళ్లీ చెంగళాపురం సూరిపై పెట్టి హైడ్రామా నడుమ నామమాత్రపు కేసు పెట్టారు. గతంలో అంతటి అవమానభారాన్ని అనుభవించిన శ్రీకాకుళం తెలుగుతమ్ముళ్లను అక్కడే ఘనంగా సన్మానించి పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి వారిని సుగాలిమిట్టకు ఆహ్వానించారు.పూలమాలలు, శాలువలు, మంగళహారతులతో ఘనంగా సత్కరించారు.టీడీపీ కార్యకర్తల సైకిళ్లకు ఏర్పాటు చేసిన చంద్రబాబు, లోకేశ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.కడప మహానాడుకు చేపట్టిన సైకిల్‌యాత్రను ఆయనే ప్రారంభించడంతో నాడు భయంతో వణికిపోయిన వారు గర్వంగా అందరి అభినందనలతో ముందుకెళ్లారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం కార్యకర్త రామకృష్ణ మాట్లాడుతూ పుంగనూరు టీడీపీ నాయకులు పిలిపించి సన్మానించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.పుంగనూరు టీడీపీ నాయకులు మాదవరెడ్డి, సీవీరెడ్డి, శ్రీకాంత్, పోలీస్‌గిరి, వెంకటముని యాదవ్, కృష్ణానాయక్, రామకృష్ణమరాజు, శమీపతి, సుబ్రహ్మణ్యంరాజు, గంగాధర్, రమణ, షామీర్, రమణ, రాఘవ, రవికుమార్, నటరాజ, ప్రసాద్, శ్రీనివాసులు, బాలాజీ నాయక్, సుబ్రహ్మణ్యం, ప్రసాద్‌స్వామి, గంగులప్ప, హరి, రాంబాబు, మాధవ తదితరులు పాల్గొన్నారు.

## మహానాడును విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్బీసీ కుట్టి

పలమనేరు, మేఁ26 (ఆంధ్రజ్యోతి) : కడపలో జరగనున్న మహానాడు కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు,ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆర్బీసీ కుట్టి కోరారు. సోమవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టి మాట్లాడుతూ చరిత్రలో మిగిలిపోయేలా మహానాడును విజయవంతం చేయాలన్నారు. నాయకులు సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్వీబాలాజి, బ్రహ్మయ్య, ఖాజాపీర్, నాగరాజు, చాంద్‌బాషా, కృష్ణమూర్తి, మదన్, బీఆర్సీ కుమార్, మాబాషా, సురేష్, భాస్కర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు. **సోమల:** మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి టీడీపీ కార్యకర్తలు, నాయకులు కలిసి వెళ్లాలని మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు పిలుపునిచ్చారు. మండలం నుంచి ప్రైవేటు బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. నాయకులు సుబ్బరాయులు, విశ్వనాథం,రెడ్డిమోహన్, రమణయ్య పాల్గొన్నారు.

## డీలర్ల సంఘ అధ్యక్షుడిగా నరేంద్రకుమార్

పలమనేరు, మేఁ26 (ఆంధ్రజ్యోతి) మున్సిపాలిటీ పరిధిలోని చౌకదుకాణ డీలర్ల సంఘ అధ్యక్షునిగా నరేంద్రకుమార్‌ను సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద డీలర్ల సమావేశం జరిగింది. జూన్ 1నుంచి డీలర్ల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ పారదర్శకంగా నిర్వహించాలని ఈ సందర్భంగా తహసీల్దార్ ఇన్బనాథన్ సూచించారు. అనంతరం డీలర్ల కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. డీలర్ల సంఘం అధ్యక్షుడిగా నరేంద్రకుమార్, ఉపాధ్యక్షుడిగా జిలాని బాషా, ప్రధాన కార్యదర్శిగా జుబేర్ అహమ్మద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మునిక్రిష్ణయ్య, కోశాధికారిగా సనావుల్లాబాషా, సెక్రటరీగా రాజేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

## కొవిడ్ నిబంధనలపై అవగాహన



ఆరోగ్య కార్యకర్తలకు డివైజర్లను అందజేస్తున్న వైద్యాధికారి చందనప్రియ

పలమనేరు, మేఁ26 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు కోవిడ్ నిబంధనలను పాటించేలా ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలని స్థానిక కాకాతోపు ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి చందనప్రియ సూచించారు. సోమవారం పారామెడికల్ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. చందనప్రియ మాట్లాడుతూ రద్దీప్రాంతాల్లో ప్రజలు మాస్కులు ధరించేలా చూడాలన్నారు. జ్వరం, ఒళ్లనొప్పులు, జలుబు లక్షణాలు ఉన్నవారు వైద్యసలహాలను పాటించాలన్నారు. మంత్ర డివైజు, బయోమెట్రిక్ డివైజర్‌ను ఆరోగ్య కార్యకర్తలకు పంపిణీ చేశారు. సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్లు నిబంధనలు పాటించాలి



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

చౌడేపల్లె, మేఁ26(ఆంధ్రజ్యోతి): జూన్ 1 నుంచి చౌకదుకాణాల్లోనే పండుగలా రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. తహసీల్దార్ మాట్లాడుతూ..డీలర్లు నిబంధనలను పాటించాలన్నారు. దుకాణం శుభ్రంగా ఉంచుకోవాలని, స్థానిక నాయకుల ఆధ్వర్యంలో తొలిరోజు ఉత్సవ వాతావరణంలో పంపిణీ కార్యక్రమం ప్రారంభించాలని ఆదేశించారు.

## ఫ్లెక్సీల చోరీపై బీజేపీ ఫిర్యాదు

చౌడేపల్లె, మేఁ26(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు కడియాల మనోహర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ..స్థానిక ఎంపీడీవో కార్యాలయం ముందు రెండు నెలల క్రితం రెండు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామన్నారు. రెండు రోజుల క్రితం వీటిని, ఫ్రేమ్‌లను అపహరించుకుపోయారని పేర్కొన్నారు

## ఘనంగా గంగ జాతర వేడుకలు



వల్లిగట్లలో ప్రతిష్ఠించిన గంగమ్మ

సోమల, మే 26 (ఆంధ్రజ్యోతి): వల్లిగట్లలో సోమవారం గంగజాతర వేడుకలు ఘనంగా జరిపారు. సోమవారం పాతూరులో ప్రతిష్ఠించిన అమ్మవారిని దర్శించుకొనేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఈక్రమంలోనే కొత్తపల్లె, దండువారిపల్లె, అగ్రహారంపల్లె, పాతూరు, ముడివారిపల్లె, పుట్టావారిపల్లె తదితర గ్రామాల మహిళలు పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. పంటపొలాల్లో బలిహరణ జరిపారు. రాత్రి గ్రామసమీపంలోని గునికుంట వద్దకు అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి జలాధివాసం కార్యక్రమం నిర్వహించారు.

## 30 నుంచి కావమ్మ మారయ్య తిరునాళ్లు

కల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లి పంచాయతీ గేటుకాడ బెస్తపల్లెలో కావమ్మ మారయ్య ఆలయంలో ఈనెల 30 నుంచి తిరునాళ్లు జరుగుతాయని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం కావమ్మ మారయ్యకు కల్యాణోత్సవం, రెండవరోజు పుష్ప పల్లకి ఊరేగింపు, మూడవరోజు అమ్మవారి సారె పంపిణీ కార్యక్రమాలుంటాయన్నారు. మూడు రోజుల పాటు అన్నదానం చేస్తామన్నారు.

## ఆకట్టుకున్న నర్తనశాల ఘట్టం



సోమల, మే 26 (ఆంధ్రజ్యోతి): నంజంపేట గార్గేయ నదీతీరం గార్గేయ గౌరీలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞం కార్యక్రమంలో భాగంగా సోమవారం పగలు భాగవతారణి రత్నకుమారి నర్తనశాల ఘట్టం అలరించింది. రాత్రి రాయలపేట నాటకమండలి నర్తనశాలలోని ముఖ్య ఘట్టాలను ప్రదర్శించింది పాండవ విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు. ధర్మకర్త గుత్తా జయలలితమ్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# మొక్కుబడిగా మారిన ఆర్టీసీ డిపో

● తగ్గిపోయిన బస్ సర్వీసులు ● రాని ఇతర డిపోల ఎక్స్‌ప్రెస్‌లు ● నేడు ఆర్టీసీ ఎండీ పర్యటన



పలమనేరు, మే 26 (ఆంధ్రజ్యోతి) : క్రమేపీ బస్ సర్వీసుల సంఖ్య తగ్గిపోవడంతో పలమనేరు ఆర్టీసీ బస్టాండ్ నామమాత్రంగా మారిపోయింది. ప్రయాణికులకు దూరమైంది. 1995 నవంబరు 18న నాటి, నేటి ముఖ్యమంత్రి నారాచంద్రబాబు ఈ బస్టాండును ప్రారంభించారు. పట్టణ నడిబొడ్డున కోట్ల రూపాయం విలువ చేసే స్థలాన్ని ఆర్టీసీకి పంచాయతీ అప్పగించింది. నాడు నాలుగు బస్సులు మాత్రమే నిలిచేందుకు వీలుగా ప్లాట్‌ఫారాలు, వసతులు కల్పించారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సరిహద్దులో ఉన్న ఈ బస్టాండును మరింత విస్తరింపజేస్తామని అప్పట్లో ప్రకటించారు. ఆచరణలో ఒక్క అడుగు కూడా పడలేదు. గతంలో ఈ డిపో జిల్లాలోనే కలెక్షన్లు, కేఎంపీఎస్ సాధన, తక్కువ ప్రమాదాల విషయంలో ఉత్తమమైనదిగా గుర్తింపు పొందింది. రానురానూ ఆర్టీసీ అధికారుల, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం కారణంగా బస్టాండు ప్రయాణికుల ఆదరణకు దూరమైంది. పలు బస్సు సర్వీసులను పుంగనూరు, చిత్తూరు, కుప్పం, మదనపల్లి డిపోలకు తరలించేశారు. ప్రస్తుతం 40 బస్సులు మాత్రమే నడుపుతున్నారు. అవి కూడా కాలం చెల్లినవే. నెల్లూరు, విజయవాడ, శ్రీహరికోట, చెన్నై, కంచి, బెంగళూరు, వంటి ఎక్స్‌ప్రెస్ సర్వీసులను రకరకాల కారణాలతో నిలిపివేశారు.

**సిబ్బంది కొరత**

డిపోలో దుకాణాలకు అద్దెకు ఇస్తూ వచ్చారు. పరిమితికి మించి ఇవి ఏర్పాటు కావడం, పొరుగుడిపోల ఎక్స్‌ప్రెస్ బస్సులు ఈ బస్టాండుకు రాకపోవడంతో దుకాణాలకు జన తాకిడి కరువైంది. ఒకసారి మూత పడిన దుకాణాన్ని, లేదా కాలపరిమితి దాటిన దుకాణాలను మళ్లీ అద్దెకు ఇవ్వాలంటే గతంలో కంటే అధికంగా నెలసరి అద్దె చెల్లించాలన్న నిబంధనను వర్తింప జేస్తుండటంతో పలు దుకాణాలు మూతపడ్డాయి. ఈ దుస్థితిపై పలమనేరు పరిరక్షణ సమితి పలుమార్లు ఆందోళనలు చేసింది. ఈ డిపోలో 20 కండక్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిసింది. రిటైరైన వారి స్థానంలో ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించడంలేదు. కుప్పం, పుంగనూరు డిపోలకు కొందరిని బదిలీ చేశారు. ఫలితంగా కొందరు కండక్టర్లు డబుల్ డ్యూటీలు చేస్తున్నారు. కొందరు డ్రయివర్లతోనే కండక్టర్ల పనిని చేయిస్తున్నారు. మంగళవారం ఈ ప్రాంతానికి ఆర్టీసీ ఎండీ ద్వారకాతిరుమల రావు రానున్న నేపథ్యంలో ఇక్కడి సమస్యలు పరిష్కారమవుతాయని ప్రయాణికులు ఆశిస్తున్నారు.



మూతబడిన షాపుల్లో కొన్ని..



కూలిన హోటల్ పైకప్పు రేకులు

## పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి



నిధులపై ప్రశ్నిస్తున్న సర్పంచ్ నాగరాజు

గుడుపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాభివృద్ధికి నిధులు విడుదల చేయాలని గుండ్లసాగరం సర్పంచ్ నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్త్రీశక్తి భవనంలో ఎంపీపీ వరలక్ష్మీ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. గ్రామాల్లో అభివృద్ధికి అప్పులు చేసి పనులు చేస్తున్నామని, చేసిన పనులకు నిధులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చీకటిపల్లె సర్పంచ్ నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారులు మట్టి తరలిస్తున్నా అధికారులు తధికారులు చర్యలు తీసుకోవడంలేదని జడ్పీటీసీ కృష్ణమూర్తి మండిపడ్డారు. కుప్పిగానిపల్లె సమీపంలోని అక్రమంగా క్వారీ తవ్వుతున్నారని పొగురుపల్లె సర్పంచ్ మీనాక్షి ఫిర్యాదు చేశారు. తాగునీటి బోర్లు వేసి నెలలు గడుస్తున్న బిల్లులు రాలేదని కొడతనపల్లె సర్పంచ్ వెంకటేష్ అన్నారు. కొన్ని శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి గురించి వివరించి సమావేశాన్ని ముగించారు. ఎంపీడీవో రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి డీలర్ల పాలాభిషేకం



శాంతిపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్ షాపు డీలర్లు సోమవారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అంతకుముందు తహసీల్దారు శివయ్య అధ్యక్షతన డీలర్ల సమావేశం జరిగింది. ప్రభుత్వం ఎండీయూ వాహనాల రద్దు చేసిందని, షాపు వద్ద రేషన్ పొందేలా ఉత్తర్వులు విడుదల చేసిందని తహసీల్దార్ తెలియజేశారు. డీలర్లు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ సీఎం చిత్రటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారట.

## మహానాడు బహిరంగసభకు తరలిరండి: గౌనివారి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారిశ్రీనివాసులు

రామకుప్పం, మే 26(ఆంధ్రజ్యోతి): టీడీపీ గురువారం కడపలో నిర్వహించనున్న మహానాడు బహిరంగసభకు రామకుప్పం మండలం నుంచి టీడీపీ శ్రేణులు, మహిళలు, యువకులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారిశ్రీనివాసులు, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డిలు కోరారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ మండలం నుంచి మహానాడు బహిరంగసభకు తరలివెళ్ళే వారి కోసం 18 బస్సులు ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు. ఈ సారి మహానాడు బహిరంగసభకు ఎంతో ప్రాధాన్యత ఉందని, సభలో అగ్రనేతలు పార్టీ పటిష్టత, రాష్ట్ర అభివృద్ధిపై దిశానిర్దేశం చేయనున్నారని వారు తెలిపారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు, నేతలు రామూర్తి, సీతాపతి, నరసింహులు, మహ్మద్‌రఫీ, మనోహర్, రామకృష్ణప్ప, రామలింగారెడ్డి, కామరాజనాయక్, నాగభూషణం పాల్గొన్నారు.

**రొంపిచెర్ల:** మండలంలోని టీడీపీ నాయకులు, కర్యాకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో మహానాడుకు తరలిరావాలని కురబకార్పోరేషన్ డైరెక్టరు ఉయ్యాలరమణ అన్నారు. సోమవారం ఆయన రొంపిచెర్లలో టీడీపీ నాయకులతో మాట్లాడుతూ ప్రతి పంచాయతీకి బస్సులు ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గ ఐ-టీడీపీ అధ్యక్షుడు గూడూరుబాబు, రఘునాథ్, మోహన్‌నాయుడు, శేషాద్రినాయుడు, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

**వి.కోట:** మహానాడుకు మండలం నుంచి భారీ సంఖ్యలో టీడీపీ శ్రేణులు తరలనున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్షుడు రంగనాథ్, జిల్లా అధికార ప్రతినిధి రాంబాబులు తెలిపారు. సోమవారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ మండలం నుంచి పార్టీ శ్రేణులు మహానాడుకు వెళ్ళేందుకు 20 బస్సులతో బాటూ, 120 ఇతర వాహనాలు ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు. ఈ సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి ఈశ్వర్, నేతలు హరి, తిప్పాచారి, లక్ష్మణ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు



సోమల, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణం పరిధిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టారు. సోమవారం పలు వీధుల్లోను, తిరుపతి రోడ్డులో ఎక్స్‌కవేటర్‌తో ముళ్ల కంపలను తొలగించారు. గుంతలను పూడ్చి, వర్షాలకు నీటి నిల్వలు లేకుండా చర్యలు చేపట్టారు. మురుగునీటి నిల్వలు లేకుండా చర్యలను చేపట్టారు. ఎంపీడీవో నారాయణ, ఈవోపీఆర్డీ లక్ష్మీదేవి, కార్యదర్శి జయశంకర్ పర్యవేక్షించారు. నంజంపేట, కందూరు, ఆవులపల్లె పరిధిలోని గ్రామాల్లో పనులు చేట్టారు.

## ఏఐటీయూసీ నిరసన



పుంగనూరు రూరల్, మేఁ26(ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం ముందు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమలో పని చేస్తున్న 2500 మందిని విధుల నుంచి తొలగించడం దారుణమన్నారు. నాయకులు మున్నా, వెంకటరమణారెడ్డి, రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మరక్షణకు కరాటే శిక్షణ



మాట్లాడుతున్న సీఐ సుబ్బరాయుడు

పుంగనూరు రూరల్, మేఁ26(ఆంధ్రజ్యోతి): పిల్లలు ఆత్మ రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సీఐ సుబ్బరాయుడు పేర్కొన్నారు. సోమవారం ఓ కళ్యాణమండపంలో జరిగిన కరాటే పోటీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ క్రీడలు, కరాటే వల్ల ఉన్నత చదువులు చదవడానికి, ఉద్యోగ అవకాశాలు పొందడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డిమహేశ్, మాస్టర్లు హేమంత్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా అమావాస్య పూజలు

రామకుప్పం, మే (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దిగువవీధి గంగమ్మ ఆలయంలో సోమవారం రాత్రి అమావాస్య పూజలు వైభవంగా జరిగాయి. రాత్రి 7గంటలకు అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

## రొంపిచెర్లలో ముత్యాలమ్మ ఊరేగింపు

రొంపిచెర్ల, మే 26 (ఆంధ్రజ్యోతి) ముత్యాలమ్మ జాతరలో భాగంగా అమ్మవారిని సింహ వాహనంపై పురవీధుల్లో మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. ఇంటింటా భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారి గుణశేఖర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## వైద్యసేవల పట్ల నిర్లక్ష్యం చేస్తే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు జిల్లా వైద్యాధికారి వెంకట ప్రసాద్

సోమల, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలల్లో రోగులకు అందుబాటులో ఉండి సేవలందించాలని అదనపు జిల్లా వైద్యాధికారి వెంకట ప్రసాద్ ఆదేశించారు. సోమవారం సోమల, కందూరు పీహెచ్‌సీలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. ప్రభుత్వం పరంగా అందించే సేవలు గురించి ఆరా తీశారు. పీహెచ్‌సీలో జరుగుతున్న కాన్పులు, గర్భవతుల నమోదు, వైద్యశాలలకు వచ్చే నిధులు వినియోగ రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ ప్రదీప్‌కుమార్ రెడ్డి, డాక్టర్ నీలిమా, డాక్టర్ విజయలక్ష్మీ, టీబీ పర్యవేక్షకులు లక్ష్మీపతి, సీహెచ్‌వో అమరనాథ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## సల్లాపురెమ్మ ఆలయంలో విశేషపూజలు



విశేషాలంకరణలో సల్లాపురెమ్మ- దర్శించుకుంటున్న భక్తులు

బైరెడ్డిపల్లె, మే 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సల్లాపురెమ్మ ఆలయంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం విశేషపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు మునివీరయ్య, వీరభద్రయ్య, నాగేంద్రప్రసాద్ అభిషేకం చేసి విశేషాలంకరణతో ప్రత్యేకపూజలు జరిపారు. కలశారాధన, దుర్గాహోమం, లలితాసహస్రహోమం, మృత్యుంజయహోమం, జయాధిహోమం, పూర్ణాహుతి, శ్రీచక్రకుంకుమార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్నదానం ఏర్పాటుచేశారు.


## దళిత మైనార్టీ యువకులను కొట్టడం దారుణం

పుంగనూరు రూరల్, మేఁ26(ఆంధ్రజ్యోతి): తెనాలిలో దళిత మైనార్టీయువకులను పోలీసులు నడిరోడ్డుపై కొట్టడం దారుణమని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసు అధికారులు రాజ్యాంగాన్ని దిక్కరించి నడిరోడ్డుపై కొట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వం, జాతీయ కమిషన్ స్పందించాల్సిన అవసరముందన్నారు.

## తెలుగుభాష పరిరక్షణకు తీర్మానం చేయాలి

గంగవరం,మేఁ26(ఆంధ్రజ్యోతి): కడపలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న మహానాడులో తెలుగు భాష పరిరక్షణకు తీర్మానం చేయాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసినాథం నాయుడు కోరారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు అమలయ్యేలా చూడాలన్నారు. ఈ మేరకు సోమవారం తిరుపతిలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ ఎంపీ వర్లరామయ్యను కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన వర్లరామయ్య మాట్లాడుతూ.. కచ్చితంగా ఈ వినతిపత్రాన్ని మహానాడు తీర్మాన కమిటీ దృష్టికి తీసుకువెళ్లి తెలుగుభాష పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామన్నారని తులసినాథం నాయుడు తెలిపారు.

# 1న పండుగ వాతావరణంలో బియ్యం పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునస్వామి

రామకుప్పం, మే 26(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో జూన్ 1న చౌకదుకాణాల ద్వారా బియ్యం, ఇతర సరకులను పంపిణీని పండుగ వాతావరణంలో చేపట్టాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పట్రానారాయణాచారిలు కోరారు. సోమవారం రామకుప్పం ఎంపీపీ చాంబర్‌లో వైస్‌ఎంపీపీ వెంకట్రామగౌడు ఆధ్వర్యంలో మండల పరిధిలోని చౌకదుకాణ డీలర్ల సమావేశం జరిగింది. గతంలో ప్రజలు పనులను మానుకుని, ఎన్ఎండీ బండ్ల కోసం పడిగాపులు కాసేవారన్నారు. ఈ పరిస్థితిని దృష్టిలో పెట్టుకున్న ప్రభుత్వం రేషన్‌షాపుల ద్వారానే సరుకుల పంపిణీని ప్రారంభిస్తోందన్నారు. సమావేశంలో నేతలు రామ్మూర్తి, గంట్లప్పగౌడు, చౌకదుకాణ డీలర్లు పాల్గొన్నారు.

**డీలర్లు బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలి**

**కల్లూరు:** డీలర్లు బియ్యం సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ జయసింహ సూచించారు. పులిచెర్లలో సోమవారం తమ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. డీలర్లు 1వ తేదీ నుంచి 15వ వరకు బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. తూకాల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవన్నారు. సమయపాలన పాటించాలన్నారు. 65 ఏళ్ల పైబడిన లబ్ధిదారులను గుర్తించి ఇంటికే బియ్యం అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులకు ఎదురవుతున్న సర్వర్ సమస్య పరిష్కారానికి కృషి జరుగుతోందన్నారు. దరఖాస్తుల ప్రకియ నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

**నదుం:** తహసీల్దారు జయప్రకాశ్ సోమవారం మండల పరిధిలోని రేషన్ షాప్ డీలర్లతో రేషన్ పంపిణీపై అవగాహన సమావేశం నిర్వహించారు. పంపిణీలో ఆటంకాలు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధ్యతలపై సూచనలు, సలహాలు చేశారు. ప్రభుత్వ ఆదేశాలను ఆయన వివరించారు.

## రేషన్ బియ్యం అక్రమ రవాణాపై విచారణ



బియ్యం నిల్వ చేశారని భావిస్తున్న ఇంటిని పరిశీలిస్తున్న ఆర్ఐ మార్కండేయులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విజయపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): 'రేషన్ బియ్యం అక్రమ రవాణా' శీర్షికన ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ అశోక్, ఆర్ఐ మార్కండేయులు, వీఆర్వో వివేక్ విచారణ నిర్వహించారు. మండలంలోని కేశవపురం ఆది ఆంధ్రవాడలో రేషన్ బియ్యం నిల్వ చేస్తున్నట్లుగా భావిస్తున్న ఇంటిని పరిశీలించారు. అయితే అప్పటికే అక్కడినుంచి బియ్యం తరలించేసినట్లు తెలుస్తోంది. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే జైలు శిక్ష తప్పదని ఈ సందర్భంగా తహసీల్దార్ కిరణ్ హెచ్చరించారు.

## 'ఉపాధి' పనుల్లో పారదర్శకత పాటించండి

పాలసముద్రం, మే 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ద్వారా మండలంలో జరుగుతున్న పనుల్లో పారదర్శకత పాటించాలని ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో ఉపాధి పనులపై సిబ్బందితో సమీక్షించారు. ప్రతి పంచాయతీలో రోజుకు 200 మంది కూలీలు పనిచేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఏపీవో మార్గరేట్, ఈసీ రాంమూర్తి, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అన్నదానం



గుడిపాల, మే 26 (ఆంధ్రజ్యోతి): గుడిపాలలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు ఆధ్వర్యంలో నిరుపేదలకు అన్నదానం చేస్తున్న విషయం తెలిసిందే. సోమవారం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని జీజేఎం ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులునాయుడు ప్రారంభించారు. మాజీ సర్పంచ్ బలరామ్, టీడీపీ నాయకులు మధుసూదన్ నాయుడు, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## తూకాల్లో తేడాలు రాకూడదు

● రేషన్ డీలర్లకు తహసీల్దార్ల హెచ్చరిక

యాదమరి, మే 26 (ఆంధ్రజ్యోతి): తూకాల్లో తేడాలు రాకూడదని రేషన్‌షాపు డీలర్లను తహసీల్దార్ పార్థసారథి హెచ్చరించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని రేషన్‌షాపు డీలర్లతో సమీక్షించారు. జూన్ ఒకటో తేదీనుంచి రేషన్‌దుకాణాల్లోనే సరుకులను కార్డుదారులకు పంపిణీ చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. పంపిణీలో సమస్యలుంటే తమ దృష్టికి తేవాలన్నారు. ఆర్ఐ ప్రసాద్, డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

**చిత్తూరు రూరల్:** చిత్తూరు అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌షాపు డీలర్లతో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. తూకాల్లో తేడాలు రాకుండా, కార్డుదారులు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని హెచ్చరించారు. డీటీలు ఇబ్రహీం, నరేష్, ఏఎస్‌వో సౌందర్‌రాజన్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కార్పెంటర్ మృతి



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, మే 26 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ కార్పెంటర్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బోడబండ్లకు చెందిన గణేష్ కుమారుడు వెంకటేష్ వృత్తిరీత్యా కార్పెంటర్. సొంత పనిపై ఈనెల 24వ తేదీన ద్విచక్రవాహనంలో పలమనేరుకెళ్లి తిరిగి వస్తున్నాడు. చెన్నై -బెంగళూరు జాతీయ రహదారి పాలమాకులపల్లె సమీపంలోని పిళ్లారి గుండు వద్దకొచ్చేసరికి వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తలకు తీవ్రగాయాలవడంతో చెన్నైలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## టీకాలతో చిన్నారుల ఆరోగ్యం సురక్షితం: డీఐవో

యాదమరి, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి చిన్నారికీ టీకాలు వేయించాలని, అప్పుడే వారి ఆరోగ్యం సురక్షితంగా ఉంటుందని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో) హనుమంత రావు తెలిపారు. సోమవారం యాదమరి పీహెచ్‌సీలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. దీనిపై ఆరోగ్య కార్యకర్తలు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎపిడెమిక్ సెల్ డాక్టర్ అనిల్ కుమార్, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య



రూబి (ఫైల్ ఫొటో)

యాదమరి, మే 26 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం కారణంగా ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. యాదమరి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరులోని శంకరయ్యగుంటకు చెందిన చాంద్ బాషా కుమార్తె రూహి అలియాస్ రూబి (30), కీనాటంపల్లె దళితవాడకు చెందిన రమేష్‌లు పదేళ్ల కిందట ప్రేమపెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. రమేష్ స్థానికంగా ఏసీ రిపేరు పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా రూబీకి గుండె పోటు, గర్భాశయ ఆపరేషన్ కారణంగా అనారోగ్యంతో ఇబ్బందులు పడుతోందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. గమనించిన కుటుంబీకులు అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## దేశమ్మ సేవలో ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మే 26 (ఆంధ్రజ్యోతి): నగరిలోని దేశమ్మ దేవాలయంలో అమ్మవారిని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారి చిత్రపటాన్ని మదన్‌మోహన్ అందజేశారు.

## ప్రభుత్వ భూమిని ఆక్రమించారని ఫిర్యాదు

చిత్తూరు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): 'చిత్తూరు రూరల్ మండలంలోని పెరుమాళ్లకండ్రిగ రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 21/4, 21/5, 22లోని ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించారు. అందులో పంటలు, పచ్చిగడ్డి వేసి అమ్ముకుంటున్నారు' అని అదే గ్రామానికి చెందిన వెంకటపతినాయుడు సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌లో చిత్తూరు రూరల్ తహసీల్దార్ లోకేశ్వరికి ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం భూమి అని రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు పెట్టినా పట్టించుకోవడం లేదన్నారు. అలాగే ముత్తూకూరు రెవెన్యూ అరతల గ్రామానికి చెందిన చెందిన మేగరాజరెడ్డి తన భూమికి పట్టాదారు పాసుపుస్తకం కావాలని అర్జీ సమర్పించారు. అలాగే మరో మూడు అర్జీలు వచ్చాయని, వాటిని సకాలంలో పరిష్కరించాలని వీఆర్వోలను తహసీల్దార్ ఆదేశించారు.

## ఆర్అండ్‌బీ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోండి

వెదురుకుప్పం, మే 26 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో ఆర్అండ్‌బీ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కార్వేటినగరానికి చెందిన చిరంజీవిరెడ్డి, కుమార్, రాజశేఖర్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ నాగరాజు, పరిపాలనాధికారి విద్యావతికి సోమవారం ఫిర్యాదు చేశారు.

## ఎంఆర్ వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్

చిత్తూరు రూరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): మీజిల్స్, రుబెల్లా(ఎంఆర్) వ్యాక్సినేషన్ స్పెషల్ డ్రైవ్‌ను విజయవంతంగా నిర్వహించాలని వైద్య సిబ్బంది డీఐవో హనుమంతరావు ఆదేశించారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. 2026 నాటికి దేశంలో మీజిల్స్, రుబెల్లా వ్యాధులను తరిమివేయాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అందులో భాగంగానే ఈ నెల 26 నుంచి 31వ తేదీవరకు మొదటి విడత స్పెషల్ డ్రైవ్ చేస్తున్నామన్నారు.



## యోగాంధ్ర సర్వే వేగవంతం చేయండి

గంగాధరనెల్లూరు, మే 26 (ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర కార్యక్రమంపై సర్వే పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో సోమలరాజు సతీష్ పిలుపునిచ్చారు. గంగాధరనెల్లూరు ఎంపీడీవో మీటింగ్ హాలులో సోమవారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో చంద్రతో కలిసి సమీక్షించారు.

**పెనుమూరు:** ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం పూర్తయ్యాక పులిగుండు వద్ద స్థల పరిశీలన చేశారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఎంఈవో భాస్కర్‌నాయుడు, సెక్రటరీలు పాల్గొన్నారు.

**వెదురుకుప్పం:** ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎంపీడీవో ఎల్.పురుషోత్తం, డిప్యూటీ ఎంపీడీవో మోహన్‌కుమార్, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు.

## భక్తి శ్రద్ధలతో రుద్రాభిషేకం

చిత్తూరు కల్చరల్, మే 26 (ఆంధ్రజ్యోతి): గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సోమవారం సాయిలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, నగర కన్వీనర్ ప్రభాకర్ నాయుడు, పాండురంగం, గజేంద్రరెడ్డి, శ్రీకంఠయ్య, భక్తులు పాల్గొన్నారు.

# ఒకే భవనంలో మూడు సచివాలయాలు!

ఓ సచివాలయానికి భవనం నిర్మాణం ● 14 నెలల కిందట ప్రారంభోత్సవం

అయినా కార్యాలయాన్ని మార్చని వైనం ● కార్వేటినగరంలో ఇదీ పరిస్థితి



కార్వేటినగరంలో మూడు సచివాలయాలు నడుస్తున్నది ఇక్కడే

వెదురుకుప్పం, మే 26 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మేజర్ పంచాయతీ కావడంతో 12052 మంది జనాభా ఉన్నారు. వీరి సౌకర్యార్థం మూడు సచివాలయాలను వైసీపీ పాలనలో ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయం-1కి గతంలో నడుస్తున్న గ్రామ పంచాయతీ కార్యాలయమే సరిపోతుంది. మిగతా రెండింటికి సొంత భవన నిర్మాణం కోసం ఒక్కోదానికి రూ.45లక్షల వంతున నిధులు కేటాయించారు. గ్రామ సచివాలయం-2 భవనాన్ని నిర్మించి, వైసీపీ పాలనలోనే



అలంకారప్రాయంగా ఉన్న సచివాలయం-2 భవనం

అప్పటి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో 2024 మార్చి 13వ తేదీన ప్రారంభోత్సవం చేయించారు. అయినా ఇప్పటివరకు ఆ భవనంలోకి సచివాలయాన్ని మార్చలేదు. ఇక గ్రామ సచివాలయం-3 భవన నిర్మాణం పనులు మాత్రం అసంపూర్తిగా ఉన్నాయి.

### మా దృష్టికి రాలేదు

కార్వేటినగరంలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభోత్సవం చేశాక కూడా అక్కడికి కార్యాలయం మార్పు చేయని విషయం, ఒకే కార్యాలయంలో మూడు గ్రామ సచివాలయాల ఉద్యోగుల విధుల నిర్వహణ మా దృష్టికి రాలేదు. దీనిపై కార్వేటినగరం ఎంపీడీవోని కనుక్కోవాల్సి ఉంది.

**- సుధాకరరావు, జిల్లా పంచాయతీ అధికారి, చిత్తూరు**

## 'మహానాడు'ను విజయవంతం చేద్దాం: టీడీపీ

గుడిపాల, మే 26 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో జరగనున్న టీడీపీ మహానాడును విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సీనియర్ నాయకులు బాలాజీనాయుడు, చెన్నకేశవులనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు ప్రసంగించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో కడపకు గుడిపాల నుంచి 15 బస్సులు, 50 కార్లు బయల్దేరుతాయని చెప్పారు. వచ్చేవారంతా సభ్యత్వ నమోదు కార్డులు తీసుకుని రావాలని సూచించారు.

**అధికారుల తీరు మారలేదన్న నాయకులు:** కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా అధికారుల తీరు మారలేదని చిత్తూరు పార్లమెంటు ఎస్సీసెల్ టీడీపీ అధ్యక్షుడు పీటర్, తెలుగు యువత మండల అధ్యక్షుడు శంకర్‌చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ వారికే పనులు జరుగుతున్నాయని.. టీడీపీ నాయకులు న్యాయంగా ఉన్న అధికారులు పనులు చేయడం లేదని ఆరోపించారు. మహానాడు అయిన వెంటనే దీనిపై దృష్టి పెడతామని నాయకులు హామీ ఇచ్చారు. అనిల్‌కుమార్, సాంబశివనాయుడు, నాగరాజ్‌యాదవ్, సంగీత, అరుణ్, చల్లా, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో తరలిరండి

**పూతలపట్టు:** కడపలో మంగళవారం నుంచి జరగనున్న టీడీపీ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి, జిల్లా పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి పిలుపునిచ్చారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ.. కడపలో జరిగే ఈ ఈ కార్యక్రమాలకు ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తరలిరావాలని కోరారు. నాయకులు జగన్నాథం, దుబాయి నరసింహులు, మధు, నేతాజి, హేమాద్రి నాయుడు, మోహన్ నాయుడు, బాలు తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో ప్రసంగిస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు - మీడియాతో మాట్లాడుతున్న దొరబాబు చౌదరి తదితరులు

## జీవిత బీమాతో ధీమాగా ఉండండి




కార్తీక్ తల్లిదండ్రులకు చెక్కును అందజేస్తున్న తపాలా శాఖ అధికారులు

బంగారుపాళ్యం, మే 26 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా చేస్తే ధీమాగా ఉండవచ్చని డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.లక్ష్మన్న అన్నారు. సోమవారం ఎగువ రాగిమానుపెంట గ్రామంలో వీరజవాన్ పంగల కార్తీక్ తల్లిదండ్రులు వరదరాజులు, సెల్విలను వారి స్వగృహంలో కలిశారు. ఆయన మాట్లాడుతూ.. కార్తీక్ రెండేళ్ల కిందట సెలవుల్లో గ్రామానికి వచ్చినప్పుడు చిత్తూరు తపాలా కార్యాలయంలో రూ.10 లక్షలకు బీమా చేయించుకున్నాడని తెలిపారు. దురదృష్టవశాత్తూ కార్తీక్ ఉగ్రవాదుల దాడిలో వీరమరణం పొందడంతో నామినీగా ఆయన తల్లికి జీవిత బీమా సొమ్ము రూ.11,50,053ల చెక్కును సోమవారం అందజేశారు. పలమనేరు సబ్ డివిజన్ అధికారి పురుషోత్తం, రాగిమానుపెంట పోస్టుమాస్టర్ జగన్‌మోహన్ పాల్గొన్నారు.

## ఎస్ఆర్‌పురం మండల సమావేశం వాయిదా

శ్రీరంగరాజపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): కోరం లేక ఎస్ఆర్‌పురం మండల సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేసినట్లు ఎంపీడీవో మోహన మురళి తెలిపారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీపీ, ప్రజా ప్రతినిధులు హాజరు కాకపోవడంతోపాటు సర్పంచ్‌లుగా భార్యలుంటే భర్తలు రావడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశానికి సర్పంచులే రావాలని, వారి స్థానంలో వేరొకరు రాకూడదని చెప్పారు. ఎంపీపీ సూచనల మేరకు ఎప్పుడు సమావేశం నిర్వహిస్తామనే విషయాన్ని ప్రకటిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ కమిషనర్‌తో చర్చలు



చర్చల్లో పాల్గొన్న గుణశేఖర్

వెదురుకుప్పం, మే 26 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం సీట్ల విషయం, ఫీజు పెంపు తదితర విషయాలపై సోమవారం విజయవాడలో విద్యాశాఖ కమిషనర్‌తో జరిగిన చర్చల్లో పాల్గొన్నామని యూపీఈఐఎఫ్ స్టేట్ జాయింట్ సెక్రటరీ(వెదురుకుప్పం) సాతాల గుణశేఖర్ తెలిపారు. ఈ చర్చల్లో అపుస్మా, అప్సా, ఇస్మా రాష్ట్ర అధ్యక్షులు తులసి విష్ణుప్రసాద్, సుబ్రహ్మణ్యంరాజు, శ్రీకాంత్ పాల్గొన్నారని తెలియజేశారు.

## ఒకటినుంచి క్రికెట్ టోర్నీ

పూతలపట్టు, మే 26 (ఆంధ్రజ్యోతి): ముత్తిరేవుల సమీపాన ఉన్న శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల (ఎస్వీసెట్) ఆటస్థలంలో జూన్ ఒకటో తేదీనుంచి గంగారపు గోపి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ మేరకు గోపి యువసేన సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 93817 57237, 87900 40553, 80088 98161 నెంబర్లను సంప్రదించాలన్నారు.

## ముందస్తుగా కాలువల్లో పూడికతీత



పూడికతీత పనులను పరిశీలిస్తున్న మేయర్ అముద

చిత్తూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): వర్షాలొస్తాయన్న హెచ్చరికలతో నగరపాలక పరిధిలోని కాలువల్లో ముందస్తుగా పూడికతీత పనులను మేయర్ అముద ఆదేశాలతో చేపట్టారు. సోమవారం కట్టమంచిలో జరుగుతున్న పనులను ఆమె పరిశీలించారు. వర్షాలు కురిస్తే ఎక్కడా మురుగు బ్లాక్ కాకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. పనుల గురించి ఎంహెచ్‌వో లోకేష్ ఆమెకు వివరించారు.

## నగరపాలక కార్యాలయంలో 'పీజీఆర్ఎస్'



అర్జీని పరిశీలిస్తున్న ఎంఈ వెంకట్రామిరెడ్డి

చిత్తూరు అర్బన్, మే 26 (ఆంధ్రజ్యోతి): నగర పాలక కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. బాధితుల నుంచి అర్జీలను ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర స్వీకరించారు. నాలుగు అర్జీలు వచ్చాయి. వీటిల్లో ఇంజనీరింగ్‌కు 2, పింఛన్‌కు 2 చొప్పున ఉన్నాయి. వీటిపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

## ఈ భవనాన్ని ప్రారంభించేదెప్పుడు?




పన్నూరు సబ్‌స్టేషన్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న నూతన భవనం

విజయపురం, మే 26 (ఆంధ్రజ్యోతి): పన్నూరు సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌కో కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఓ మోస్తరు వర్షం కురిసినా కూలిపోయే స్థితిలో ఉందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం ఉన్న కార్యాలయానికి ఎదురుగానే ఆరు నెలల కిందట కొత్త భవనం నిర్మించారు. ఈ భవనాన్ని ఎందుకనో ప్రారంభించలేదు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనాన్ని ప్రారంభించాల్సి ఉంది.

## నేత్రపర్వంగా రథోత్సవం/ అశ్వవాహనంపై వేణుగోపాలుడి విహారం

వెదురుకుప్పం, మే 26 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం రథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. వేకువ జామున స్వామిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. మొదటి గంట కార్యక్రమం తర్వాత స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. వాహన సేవ ముందు కోలాటం, చెక్కల భజనలు అలరించాయి. రథంపై మిరియాలతో కూడిన ఉప్పును భక్తులు చల్లారు. అనంతరం ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం కార్యక్రమాన్ని ఆలయ ఆవరణంలో వేదపండితులు శాస్త్రోక్తంగా చేశారు.



రథంపై వేణుగోపాలస్వామి విహారం

సాయంత్రం ఊంజల్ సేవ జరిగింది. రాత్రి అశ్వావాహనంపై స్వామివారు విహరించారు. ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశేఖర్, టెంపుల్ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, షరాబు బాబుసురేష్, కంకణ భట్టార్ తరుణ్‌కుమార్, వేదపండితులు నారాయణ దాసరి, గోపాలాచారి, శభరీష్, రమేష్, ధన్వంతరి, ప్రశాంత్ పాల్గొన్నారు.





అశ్వవాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు - రథోత్సవం ముందు కళాకారుల కోలాటం

## సంక్షిప్తంగా..

### రూ.2 లక్షల విరాళం



గుడిపాల, మే 26 (ఆంధ్రజ్యోతి): పాళ్యం కొండలోని ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి రఘునాథపురం గ్రామానికి చెందిన లలిత, సుధాకర్‌నాయుడు కుటుంబ సభ్యులు రూ.2లక్షలను విరాళంగా అందించారు. సోమవారం ఈ మొత్తాన్ని ఆలయ అధ్యక్షుడు గుర్రప్పనాయుడు, కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు రాజు, రాజగోపాల్‌నాయుడు, డిల్లీబాబు, రమేష్ పాల్గొన్నారు.

### సుఖవ్యాధులపై అవగాహన అవసరం

బంగారుపాళ్యం, మే 26 (ఆంధ్రజ్యోతి): సుఖవ్యాధుల పట్ల మహిళలు అవగాహన కలిగి ఉండాలని ఐసీటీసీ కౌన్సెలర్ బాబు అన్నారు. బొమ్మాయిపల్లెకు చెందిన గ్రామసమాఖ్యలోని మహిళలకు టీబీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. ల్యాబ్ టెక్నీషియన్ జయచంద్ర, సీసీ శిరీష, సంఘమిత్ర నీలావతి, సిబ్బంది లక్ష్మి, కల్పన, వాణి, నందిని పాల్గొన్నారు.

### 4నుంచి కుంభాభిషేకం

వెదురుకుప్పం, మే 26 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెలో కోదండరామాలయం కుంభాభిషేక కార్యక్రమం జూన్ నాలుగు నుంచి ఆరో తేదీవరకు జరగనుంది. ఈ మేరకు కార్యనిర్వాహకుడు బండి ఆనందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

### ఐరాలలో నేడు, రేపు గంగజాతర



ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ

ఐరాల, మే 26 (ఆంధ్రజ్యోతి): ఐరాలలో గార్గేయి నదీ తీరాన ఉన్న పాలేటమ్మ ఆలయంలో మంగళ, బుధవారాల్లో గంగజాతరను నిర్వహించనున్నట్లు వంశపారపర్య ధర్మకర్త ఎంకే బాలాజి తెలిపారు. ఆలయం ఎదుట గంగమ్మను నిలపడానికి భారీ షెడ్డును, భక్తులు పొంగళ్లు పెట్టడానికి, అంబళ్లు పోయడానికి ఏర్పాట్లు చేశారు. గ్రామాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

### ఎండీయూ ఆపరేటర్ల నిరసన

నగరి, మే 26 (ఆంధ్రజ్యోతి): ఎండీయూ ఆపరేటర్లు తమ వాహనాలను తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉంచి సోమవారం నిరసన తెలిపారు. తమ వాహనాల ద్వారానే రేషన్ సరుకులు సరఫరా చేయాలని కోరారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడు వేణు ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు.

### ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, మే 26 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం కుమారగిరిపై ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ● అంకాల పరమేశ్వరి అమ్మవారికి అమావాస్య సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ● వెదురుకుప్పం మండలం డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలోని జ్ఞాన ప్రసూనాంబ కొండమల్లీశ్వరస్వామి ఆలయంలోనూ పూజలు జరిగాయి. సాయంత్రం ఉత్సవమూర్తిని పల్లకీపై ఊరేగించారు. ● చవటగుంటలోని మీనాక్షి సమేత ఆవుదేవర నందీశ్వరస్వామికి రుద్రాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. ● ఎగువ కన్నికాపురంలోని మరకతవల్లీ సమేత స్వయంభు సిద్ధేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేశారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త అరుణమ్మ పర్యవేక్షించారు.